CARE
Super Speciality
Dental Hospital
- అత్యంత అధునాతన లేజర్ పరికరంతో చిగుళ్ల వ్యాధికి ప్రత్యేక చికిత్స.
- 7గురు స్పెషలిస్టు డాక్టర్లు కలిగిన ఏకైక సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల.
- రాష్ట్ర ప్రభుత్వ, APSPDCL(విద్యుత్ ఉద్యోగులకు), పెన్షనర్లకు, వారి కుటుంబసభ్యులకు రీయంబర్స్‌మెంట్ సదుపాయం కలదు.
Dr. A. Swaroop Kumar Reddy
Professor in Endodontics
Pogathota, Nellore. Ph: 2303300

Licenced to Post without Prepayment (AP/VJ-16/WPP/2012-13)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

సమీక్షణం

సంపుటి: 83 • సంచిక: 17 • 26-4-2013 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

Hotel D.S.R Paradise

అయ్యప్పగుడి సెంటర్, నెల్లూరు.
ఫోన్: 2354888, 2308666
సెల్: 8008256888, www.dsrparadise.com

పార్టీని నడిపేవారెవ్వరు... జగన్‌లో మధనం!

వైఎస్ జగన్ పది నెలల నుంచి జైలులో వున్నా తన పార్టీని సమర్థవంతంగా నిర్వహించగలగడానికి కారణం సజ్జల రామకృష్ణారెడ్డి, వైవి సుబ్బారెడ్డి తనకు కళ్లు, చెవుల వలె మెలగడం. జగన్ మనసులో ఏమి వుందో, ఆయన ఏమి కోరుకొన్నారో ముందుగానే వూహించి అందుకు అనుగుణంగా నడుచుకోవడం వీరిద్దరి పని. తమ స్వార్థం లేకుండా వీరు తమ బాధ్యత నిర్వహిస్తున్నంత వరకు జగన్‌కు చీకాకులు లేవు. కానీ రాజకీయాలలో స్వార్థం లేకుండా ఉండడమే కాదు, అనుభవంతో సమయస్ఫూర్తితో మెలగడం కూడా అవసరం. కానీ వైవి సుబ్బారెడ్డిలో అవి లోపించడం జగన్‌కు తలనొప్పిగా మారింది. వీరిలో సజ్జల రామకృష్ణారెడ్డి కొంత జాగ్రత్తపరుడు. ఎంతవరకు జోక్యం చేసుకోవాలో అంతవరకే పరిమితమౌతాడు. స్వంతంగా ఎవరినీ ప్రోత్సహించడు. ఎవరికీ సిఫార్సు చేయడు. జగన్ మాట తన మాట అన్నట్లు వుంటాడు. అందులోనూ ఆయన అన్న సజ్జల దివాకరరెడ్డి కూడా జగన్‌కు సన్నిహితుడు. అందువల్ల ఒకవేళ రామకృష్ణారెడ్డి తప్పు చేయబోయినా దివాకరరెడ్డి సరిదిద్దుతూ వుంటాడు.

వైవి సుబ్బారెడ్డి మీద అటువంటి నియంత్రణ లేదు. అయితే ఆయనకు రాజకీయ అనుభవం శూన్యం. వైఎస్ కుటుంబ సభ్యుడే అయినప్పటికీ ఏ రోజు కూడా ఎమ్మెల్యే టిక్కెట్ల పంపకం, రాష్ట్రంలో వివిధ రాజకీయవాదులతో సాంగత్యం వంటివి పెట్టుకోలేదు. ఇప్పుడు మొత్తం 294 మంది ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికలో ఆయన పాత్ర కీలకంగా మారింది. తన స్వంత జిల్లా ప్రకాశంలో తన మాట కొంచెం అధికంగా నెగ్గించుకోవాలన్న కోరిక హెచ్చింది. దానితో తప్పులు చేస్తున్నాడు. అది జగన్‌కు చీకాకు కల్గిస్తున్నది.

ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికకు వైఎస్ఆర్ కాంగ్రెస్ అనుసరిస్తున్న విధానం నియోజకవర్గ కోఆర్డినేటర్ల నియామకం. మొదటి జాబితాలో పెద్దగా పేచీలు తలెత్తలేదు. జగన్ ముందుగానే కసరత్తు చేసి పెట్టి వెళ్లిన వారిని మొదటి జాబితాలో ప్రకటించారు. రెండవ మూడవ జాబితాల దగ్గరకు వచ్చేసరికి ఇబ్బందులొచ్చాయి. వైవి సుబ్బారెడ్డి జరిపిన ఎంపికలో దాదాపు 20 శాతం అభ్యర్థుల విషయంలో గందరగోళం, పొరపాట్లు దొర్లాయని జగన్‌కు అర్థమైంది. ఎన్నికలకు ఇంకా ఏడాది వుంది కాబట్టి వీటిని సరిదిద్దుకొనే అవకాశం వుంటుంది కాబట్టి, అంతగా ప్రమాదం కల్గక పోవచ్చు. కానీ ఎంపికలో తప్పుల వల్ల చాలా నియోజకవర్గాలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ అభ్యర్థులనుకొన్నవారు ప్రత్యర్థి పార్టీల మీద పై చేయి సాధించడానికి ప్రయత్నం చేయవలసిందిపోయి, తమలో తాము కొట్లాడుకొం

కొరవ 14వ పేజీలో

అర్థంకాని మేకపాటి సోదరులు!

• తలలు పట్టుకొంటున్న వైకాపా నేతలు.

మేకపాటి రాజమోహన్‌రెడ్డి రాజకీయ శైలి అర్థం కాక తలలు పట్టుకొంటున్నారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేతలు. జగన్ కోసం అన్నీ వదలుకొని వచ్చిన త్యాగిగా ఇప్పటివరకు ఆ పార్టీలో ఆయనకు ఎనలేని గౌరవం వుంది. అందరూ ఆయన్ను పెద్దాయనగా చూస్తారు. జగన్ తర్వాత జగన్ అంతటివాడిగా గుర్తిస్తారు. కానీ నెల్లూరుజిల్లా రాజకీయాలలో పెత్తనం కోసం ఆయన పట్టు పట్టడం వారిని బాగా ఇబ్బంది పెట్టింది. నెల్లూరురూరల్‌లో కోటం రెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు సిటీలో అనిల్ కుమార్ యాదవ్‌లను నియోజకవర్గ ఇన్‌ఛార్జీలుగా నియమించే విషయంలో మేకపాటికి, పార్టీ నేతలకు పేచీ వచ్చింది. మేకపాటి మాట విన్పించుకోకుండా ఆ ఇద్దరికీ నియామక పత్రాలు ఇచ్చేశారు. గూడూరు, సూళ్లూరుపేటల విషయంలో మాత్రం ఆయన మాటను కాదనకుండా అట్లని అవును అని చెప్పకుండా నిర్ణయాన్ని నానుస్తున్నారు. దానికి అలుక వహించిన మేకపాటి రాజమోహన్‌రెడ్డి హైదరాబాదులోని పార్టీ ఆఫీసుకు రాకపోకలు తగ్గించివేశాడు. అదివరకు దాదాపు ప్రతి రోజూ ఏదో ఒక సమయంలో ఆఫీసుకు వచ్చి, వెళ్లేవాడాయన. కానీ నెల రోజులుగా అటు వైపు ముఖం చూపడం లేదు. మరీ అవసరమైనప్పుడు మొక్కుబడిగా వచ్చి, ముక్తసరిగా మాట్లాడి వెళ్తున్నాడు.

ఈ నేపథ్యంలో ఉదయగిరి నియోజకవర్గం సీతారామపురంలో జరిగిన ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డి సభకు మేకపాటి శేఖర్‌రెడ్డి హాజరు కావడం పార్టీలోని వారందరినీ ఇబ్బంది పెడుతున్నది. రామనారాయణరెడ్డి ఏ కారణం వల్లనో తెలియదు కానీ జగన్ మీద విరుచుకపడుతున్నాడు. జగన్ చేసిన నేరాలకు జైలు శిక్ష చాలదని, ఉరి తీయాలని బహిరంగంగా ప్రకటన చేశాడు. తమ పార్టీ నేత పట్ల అంత కఠినంగా మాట్లాడిన మంత్రి సభకు మేకపాటి శేఖర్‌రెడ్డి హాజరు కావడం వెనుక ఉద్దేశ్యం ఏమిటో ఎవరికీ అర్థం కావడం లేదు. జగన్‌ను దారుణంగా తిట్టిన రామనారాయణ రెడ్డి కార్యక్రమాలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వాళ్లు ఎవరూ హాజరు కాకూడదని, నా నియోజకవర్గం కార్యక్రమాలకు కూడా నేను వెళ్లబోవడం లేదని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి శపథం చేసిన విషయం ఇక్కడ గమ

కొరవ 14వ పేజీలో

ప్రభవ Prabhava School
బుడి
పొగతోట, నెల్లూరు.
ఫోన్: 2333767, 2337573
అడ్మిషన్లు జరుగుచున్నవి

www.prabhavaschool.com

హార్థిక శుభాకాంక్షలు

ఢిల్లీ తెలుగు సంఘం వారు నిర్వహించిన ఉగాది కార్యక్రమంలో
ఢిల్లీ ముఖ్యమంత్రి గౌ॥ షీలాదీక్షిత్ చెల్లెలు, ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన సలహాదారు
గౌ॥ రమాదీక్షిత్ చేతులమీదుగా ఉగాది పురస్కారం మరియు సన్మానం
అందుకొన్న డాక్టర్ జి.కొండారెడ్డి గారికి
మా హృదయపూర్వక శుభాకాంక్షలు.
డాక్టర్ మహమ్మద్ ఆలి

పెరిగిపోతున్న పాశవికత్వం!

పిల్లలు, దేముడు చల్లని వారే, కల్ల కపటమెరుగని కరుణామయులే... అన్నది మన సంస్కృతి. ఐదారేడుల పాపలు విరిసీ విరియని పువ్వులన్నాడు యుగకవి. కానీ అప్పుడే వికసిస్తున్న కుసుమాలను కసిగా కాలి క్రింద వేసి తొక్కి, నలిపి వేసే పాశవికత్వం మన సమాజంలో పెట్రేగి పోతున్నది. పసి పిల్లల మీద అత్యాచారాలు చేసే నర రూప రాక్షసుల సంఖ్య పెరిగి పోతున్నది. సమాజం మొత్తం మీద మానవత్వం హరించుకపోయి దానవత్వం పెచ్చరిల్లుతున్నది.

ఢిల్లీ నగరంలో ఐదేళ్ల పసి పాప మీద జరిగిన క్రూరమైన అత్యాచార సంఘటన వింటుంటే గుండెలు అవిసి పోతున్నాయి. వీధిలో ఆడుకొంటున్న పసికూనను ఎత్తుకపోయి, ఇద్దరు కసాయిలు కలిసి రెండు రోజుల పాటు రాక్షస రతి జరిపారట. ఆ దీనురాలి మర్మావయవంలో ప్లాసిక్ సీసాలు, కొవ్వొత్తులు చొప్పించి, బాధతో కేకలు పెడుతుంటే నవ్వుతూ వినోదించారట. మానవ సమాజంలో ఇటువంటి ఘాతుకాలు కూడా జరుగుతాయంటే నమ్మడం కష్టం. మనుషులు ఇంత క్రూరంగా ప్రవర్తించగలరనే ఊహ కూడా మనసులోకి రావడం కష్టం. కానీ అది జరిగి పోయింది. ఆ పసికూన వచ్చే ప్రాణం పోయే ప్రాణంతో ఆస్పత్రి మంచం మీద విల విల లాడుతున్నది. ఆ పసికందును మోసుకొచ్చిన స్ట్రెచర్ మీద నెత్తుటి మరకలతో కూడిన బొమ్మలు కన్పించాయి. ఆ దృశ్యం చూసిన తర్వాత కళ్లు చెమ్మగిల్లని మానవ హృదయం లేదు.

సోనియాగాంధీ, మన్మోహన్‌సింగ్‌లతో సహా యావత్ రాజకీయ గణం ఈ ఘోరం మీద దిగ్భ్రాంతి వ్యక్తం చేయడం, ఢిల్లీ వీధులలో పురజనులు ఆందోళనకు దిగడం, వారి మీద పోలీసులు లాఠీలు ఝళిపించడం, దురుసుగా ప్రవర్తించిన అధికారులను సస్పెండ్ చేయడం వంటివన్నీ షరా మామూలుగా జరిగిపోయాయి. నాలుగు రోజుల తర్వాత వార్తా పత్రికలలో ఆ వార్త కన్పించడం మానేసింది. ఆ పాప ఏ దుర్గతిలో వుందో తెలుసుకోవాలనే కుతూహలం దేశ ప్రజలలో అదృశ్యమైపోయింది.

మృగంగా మగవాడి క్రూరత్వానికి ఆహూతైపోయే అభాగ్యుల పరంపరలో ఈ దీనురాలు ఒక చిన్న ఉదాహరణ మాత్రమే. దేశంలో ఇటువంటి అకృత్యాలు నిత్యం జరిగిపోతూనే వున్నాయి. మన రాష్ట్రంలో ఒక తొమ్మిదేళ్ల పసికూనను ఆమె తాత, పినతండ్రి కలిసి చెరిచారట. ఆ గాయాలేమిటని అడిగితే, తాత కొరికాడు, చిన్నాయన ఏదో చేశాడని అమాయకంగా బదులిచ్చిందట ఆ చిన్నారి.

మనుషుల మధ్య ఈ మృగత్వాన్ని నిరోధించడం కోసమే మానవ సంబంధాలను నిర్దిష్టంగా నిర్వచించాయి ధర్మ శాస్త్రాలు. తల్లి, చెల్లి, భార్య, వదిన, కూతురు, మనుమరాలు వంటివారి పట్ల ఎట్లా ప్రవర్తించాలో స్పష్టంగా మన మనసుల లోకి చొప్పించాయి అవి. ఆ నియమం పాటించకుంటే నాగరికత అనేది ప్రభవించేది కాదు. మనుషులంతా ఆటవికులుగా మెలగుతూ వుండేవారు. కొన్ని లక్షల సంవత్సరాలుగా మానవ సమాజాన్ని అదృశ్యరూపంలో నడిపిస్తున్న ధర్మ శాస్త్రాలు ఇప్పుడేమైపోయాయి? ఇటువంటి నేరస్తులను శిక్షించడానికి కఠినమైన చట్టాలు వుండాలనడం నిజమే. కానీ అంతకంటే ముఖ్యంగా మనసులలో గూడుకట్టుకొంటున్న మాలిన్యాన్ని నిర్మూలించడానికి మతపరమైన బోధన చాలా అవసరం. ప్రేమ, సేవ, త్యాగం, దానం, ధర్మం వంటి సులక్షణాలను పాఠ్య పుస్తకాలు, చట్టాల కంటే అధికంగా మతపరమైన, ఆధ్యాత్మిక మైన బోధనలు మనసులలోకి చొప్పించగలుగుతాయి. కానీ హైందవ సమాజంలో మతం అనేది ఈ రోజొక వ్యాపార వస్తువుగా మారింది. స్వామీజీలు, బాబాలు, మత ప్రచారకులు భక్తులను ఆకట్టుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారే కానీ, భక్తులను సన్మార్గంలో పెట్టడానికి శ్రద్ధ చూపడం లేదు. ఆశ్రమాల విస్తీర్ణం పెంచుకోవడానికి, భక్తుల సంఖ్య వృద్ధి చేసుకోవడానికి, సంపద పోగేసుకోవడానికి మాత్రమే శ్రమిస్తున్నారు మన ఆధ్యాత్మికవేత్తలలో అధిక సంఖ్యాకులు. దాని వల్లనే మనుషులకు మంచి చెప్పే వారు కరువైపోతున్నారు. మన సమాజంలోని ఈ వైపరీత్యాలకు చట్టాల వైఫల్యం ఎంత ప్రముఖమైనదో, ఆధ్యాత్మిక దివాళాకోరుతనం కూడా అంతే ప్రాధాన్యత కలిగి వుందని చెప్పక తప్పదు.

చట్టాల విషయానికి వస్తే, నిర్భయ దుర్ఘటన తర్వాత రూపొందించిన అత్యాచార నిరోధ చట్టం కూడా మహిళలకు రక్షణ కల్పించలేక పోతున్నది. చట్టం చేయడం కంటే దాని అమలు కీలకం. అత్యాచార ఘోరానికి పాల్పడిన నేరస్తులను నెల రోజుల లోపల శిక్షించే విధంగా న్యాయ వ్యవస్థను కూడా సంస్కరించాలి. జరిగిన దుర్ఘటన మరపుకు రాకముందే నేరస్తుడికి శిక్ష పడే వ్యవస్థ వుంటే కొంతలో కొంత చట్ట భయం ఏర్పడుతుంది. లేదంటే ఈ దుర్ఘటనలను చట్టాలు ఎంత మాత్రం ఆపలేవు.

జమీన్‌రైతు

జనవాక్కు

కొత్తదేముడు రామదూత!

జిల్లా సరిహద్దులో వెలసిన రామదూత వద్దకు మంత్రులు, అధికార గణం వరుస బెట్టి వెళ్లి సాష్టాంగ ప్రమాణాలు చేయడం ఆక్షేపణీయం. ప్రజా జీవితంలో ఉన్నవారు కొన్ని విలువలు పాటించాలి. ఈ విలువలు వదిలేస్తే సామాన్యులకు వీరికి తేడా ఏముంది? ఇప్పటికే రామదూత కుటుంబ సభ్యుడొకరి కనుసన్నులలో కావలి పోలీస్ యంత్రాంగం నడుస్తుంది. గతంలో రామదూత ఆశ్రమానికి వచ్చిన బిజెపి జాతీయ అధ్యక్షుడు గడ్కారీ అవినీతి ఆరోపణల్లో చిక్కుకొని పదవి పొగొట్టుకున్నాడు. హెలికాప్టర్‌లో వచ్చి దిగి స్వామి పదాలు పట్టుకొన్న గాలి జనార్దన్‌రెడ్డి జైలు పాలయ్యాడు. కర్నాటక ముఖ్య మంత్రి యడ్యూరప్ప, రైల్వేమంత్రి మునియప్పన్ ఈ బాపతులోని వారే. ఇక ఈ సంవత్సరం స్వామి ఆశ్రమంలో అడుగుపెట్టిన ప్రముఖుల భవిష్యత్తు ఎట్లుంటుందో చూడాలి. ప్రజాజీవితంలో ఉండే మంత్రులు, అధికారులు తమ స్వంత డబ్బులతో రామదూత ఆశ్రమానికి రండి పొండి. ప్రజల డబ్బులతో ఈ పని చేయడం రాజ్యాంగ విరుద్ధం.

పి.శ్రీరాములు నెల్లూరు

కోవూరు గ్రామంగానే ఉండిపోవాలా?

జిల్లాలో నెల్లూరు నగరం తర్వాత డెల్టా ప్రాంతంలో ప్రముఖ గ్రామంగా కోవూరు వాసికెక్కింది. సంపన్నులు, విద్యావంతులకు కొదవలేకపోయినా స్థానికులెవరూ రాజకీయాల్లో తలదూర్చకపోవడంతో స్థానికేతరులు పెత్తనం చెలాయిస్తున్నారు. పెన్నానదిపై బ్రిడ్జి, థర్మల్ స్టేషన్, షుగర్ ఫ్యాక్టరీ నిర్మాణంతో కోవూరు ప్రగతి పథంలో పయనిస్తుందన్న ఆశ నిరాశగా మారింది. కోవూరు అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుంది. గూడూరు, కావలి, వెంకటగిరి, ఆత్మకూరు, సూళ్లూరుపేటలు మునిసిపాలిటీలైనా కోవూరుకు ఈ హోదా దక్కకపోవడం బాధాకరం. కోవూరు స్థాయి పెంచేందుకు ప్రజలు, నాయకులు పోరుబాట నడవడమే ఏకైక మార్గం.

ఎన్.రామచంద్రారెడ్డి చెన్నై

చిత్తశుద్ధి ముఖ్యం!

కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న విద్యారంగ సంస్కరణల్లో భాగంగా రాష్ట్రానికి 300 మోడల్ స్కూళ్లు మంజూరయ్యాయి. అయితే ఈ బృహత్తర పథకం విజయవంతంగా అమలు కావాలంటే ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయాల్సి వుంటుంది. అధికారుల చేతివాటం, కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నాసిరకం భవన నిర్మాణాలు, అనుభవజ్ఞులైన బోధనా సిబ్బందిని నియమించడం, స్కూళ్లలో సమకూర్చే అత్యాధునిక పరికరాలు నిత్యం పని చేసేలా చూడడం, అంతకంటే ముఖ్యంగా అడ్మిషన్ ప్రక్రియలో గ్రామీణ ప్రాంతాల వారికి, అందులోనూ వెనుకబడిన తర

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

30-4-1943
పేజీలు : 4 వెల: 0-1-6

నెల్లూరు ముచ్చట్లు
జిల్లా బోర్డు మీటింగ్

బోర్డు మీటింగ్ మే నెల 7వ తేది శుక్రవారం సాయంత్రం 4 గంటలకు తదియ ఘడియల్లో జరుగుతుంది. ఆ సమావేశంలో రెండు ఆంబోతు ఎద్దులను రూ500లకు మించకుండా కొనుట, సాయిపేట కుదుములదిన్నెపాడులోని ఆయుర్వేద ఆసుపత్రిని కనిగిరి తాలుకా తిమ్మారెడ్డిపల్లెకు మార్చుటను గురించిన్నీ, కలిగిరి రోడ్డులో నీడకు ఉపయోగపడు 152 తాటిచెట్లను ధర్మంగా యిచ్చుట, ఇంకొక చోట నాలుగు చెట్లను వేసి పెంచుటకు ధనం వెచ్చించుట, దర్శి డివిజన్ అరవల్లిపాడు స్కూలు మూసివేయుట మున్నగు విషయాలు చర్చకు రాబడును.

సారస్వత వసంతం

3వ తేది మహాభారత రచయిత తిక్కన కవి బ్రహ్మోత్సవం. ఆ శుభ వేదిక మీదనే రాయప్రోలు కవి కుమారునికి నూటపదహార్ల బహుకరణ; 4వ తేది బృందావనంలో కృష్ణ సదనాన అమృత కలశ గీతా గానోత్సవం; 5వ తేది తిక్కవరపు రామిరెడ్డి గారి అంకితోద్యానంలో కృతి సమర్పణ పరిషత్తు, మధుర కవితా స్రవంతీ పిత జాషువాకు రూ 1116ల బహుకరణం, సాహిత్యోపాసకుల దుర్భాశర్మ గుర్రం సుబ్బ రామయ్య గారలకు రూ 116ల సత్కారం; 25వ తేది కృష్ణుని బృందంతో కృతిసమర్పణ మహోత్సవం, కవితా కళానిధి, కవికోకిల మధుర కూజితరావాలు, ఈ ఫల కుసుమ పరిమళ శోభితమైన సారస్వతమని దర్శిస్తుంటే ఆంధ్ర "కవితకు పెండ్లి పందిళ్లు గప్పించు శుభ ముహూర్తాలు సమీపించినాయనిపిస్తుంది".

50 ఏళ్ల క్రితం ఈవారం

26-4-1963
పేజీలు: 12 వెల: 0-20 న.పై

చక్కెర వీశ రూ4లు!

నెల్లూరు టవున్‌లో గత వారం రోజులుగా చక్కెర కరవుతో ప్రజలు కటకటలాడి పోతున్నారు. హోల్‌సేల్ వ్యాపారుల వద్ద స్టాకు లేదు. చిల్లర వ్యాపారులు చీకటిలో అక్కడక్కడ విక్రయిస్తున్నారు గానీ ధర నిన్న (25వ తేది) వీశ రూ.4.00 వరకు పోయింది. అది కూడా అన్నిచోట్ల దొరకుట లేదు. కొన్నిచోట్ల ఖండసారి చక్కెర విక్రయింపబడుతున్నట్లు తెలుస్తున్నది.

టవున్‌లోని హోటళ్లు స్వీట్లు మానివేసినవి. పరిస్థితి ఈవిధంగానే వుంటే అసలు హోటళ్లే మూసివేయవలసి వస్తుందని హోటళ్ల అసోసియేషన్ ఒక తీర్మానంలో హెచ్చరించింది.

నెల్లూరు టవున్‌లో వున్న ముగ్గురు హోలోసేల్ వ్యాపారులకు నెలకు దాదాపు 7వేల బస్తాల చక్కెర వస్తుంది. ఒక్క నెల్లూరు టవున్‌కే నెలకు వెయ్యి బస్తాలకు పైగా కావాలట. అటువంటప్పుడు పక్షం రోజులుగా సరఫరా లేకుంటే పరిస్థితి ఏవిధంగా వుంటుందో వూహించుకోవచ్చు.

చక్కెర విడుదలకు సంబంధించి నిన్న, నేడు హోలోసేల్ వ్యాపారుల నియామకం జరుగుతున్నట్లున్నది. కలెక్టర్‌చే నియమింపబడిన ఈ వ్యాపారులు మిల్లుల నుంచి చక్కెర దిగుమతి చేసికొని, సరఫరా చేయవలసి వుంటుంది. మే 1, 2 తేదులలో చక్కెర రావచ్చునని తెలుస్తున్నది. అంతవరకు ఈ బాధ తప్పదు.

కావలిలో వీశ రూ3లు!

గత మూడు నాలుగు రోజులుగా చక్కెర దొరకటమే లేదు. ఎచ్చటనైనా దొరికినా వీశ రూ3.00లు ఉన్నది. రోగులు, బిడ్డలు, కాఫీకి అలవాటు పడినవారు అల్లాడి పోతున్నారు.

–మా.వి

నెల్లూరు ముచ్చట్లు

ప్రక్కకు తప్పుకొన్న కాకాణి!

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్ బాధ్యతల నుంచి ప్రక్కకు తప్పుకొంటున్నట్లు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రకటించారు. 22వ తేది పొదలకూరురోడ్డులోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. నేను సర్వేపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా బిజీగా ఉన్నాను. దీనికితోడు పార్టీ నన్ను బాపట్ల పార్లమెంటరీ స్థానం ఇన్‌ఛార్జ్‌గా కూడా నియమించింది. యిన్ని బాధ్యతల నిర్వహణ కష్టం కాబట్టి జిల్లా కన్వీనర్ బాధ్యతల నుంచి తప్పుకొంటున్నాను. రెండేళ్ల పాటు ఈ బాధ్యతల నిర్వహణకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారాయన. కొత్త కన్వీనర్‌ను పార్టీ త్వరలోనే నియమిస్తుందని చెప్పి హుందాగా ప్రక్కకు తప్పుకొన్నాడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి.

అనవసర గొడవ

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి ప్రజా సమస్యలపై పోరాటం చేయడం అలవాటు. 22వ తేది క్రికెట్ బెట్టింగులు, బెల్ట్‌షాపులను అరికట్టాలని ఎస్పీ రమణకుమార్ ప్రజా విజ్ఞప్తుల దినోత్సవాన్ని నిర్వహించే వేదిక వద్దకు వెళ్లారు. ఈ ప్రదర్శనపై ఎస్పీకి పోలీసు అధికారులు ఏం సమాచారం అందించారో ఏమో ఆయన శ్రీధర్‌రెడ్డిని లా అండ్ ఆర్డర్ వ్యవహారాలెందుకు రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల వంటి వాటిపై ఉద్యమించమని సలహా యిచ్చారు. దీనికి ప్రతిగా శ్రీధర్‌రెడ్డి ఏ ప్రజా సమస్యనైనా జిల్లా అధికారులకు నివేదించడం తప్పెలా అవుతుందన్నారు. మొత్తానికి శ్రీధర్‌రెడ్డి నిలదీత మహత్యమో, ఇంకేమైనా కారణమో తెలియదుకానీ క్రికెట్ బెట్టింగు రాయుళ్ల పని పట్టండని ఎస్పీ క్రిందిస్థాయి పోలీసు అధికారులను హెచ్చరించారు.

కార్పొరేషన్‌పై ఎసిబి పంజా!

నెల్లూరు కార్పొరేషన్‌లోని టౌన్ ప్లానింగ్ విభాగం అవినీతి మల్లులతో నిండి పోయింది. వీరితో పెట్టుకొంటే లేని పోని సమస్యల్లో చిక్కుకొంటామని నగరంలోని భవన నిర్మాతలు, అపార్ట్‌మెంట్స్ బిల్డర్స్ ఊరుకొంటుండడంతో రెచ్చిపోతున్నారు. కానీ ఓ బిల్డర్ ధైర్యం చేసి బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ మధు ఆయన సహాయకుడు బాబురావు, అటెండర్ శ్రీనివాసులురెడ్డిలను 22వ తేది సాయంత్రం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టించారు. సునీల్ కుమార్‌రెడ్డి వేదాయపాళెంలో అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టాడు. సెట్ బ్యాక్‌లో ఆక్రమణలు, ఐదో అంతస్తులో పెంట్ హౌస్ నిర్మించారని ఈ ప్రాంత బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ ఐదు లక్షల రూపాయలు డిమాండ్ చేశాడు. ఇవ్వకుంటే అపార్ట్‌మెంట్ నేలమట్టం చేస్తానన్నాడు. దీంతో బాధితుడు ఎసిబిని ఆశ్రయించడం వారి సూచన మేరకు మూడు లక్షలు ముందస్తుగా చెల్లించే ప్లాన్‌లో భాగంగా మధుకు ఇవ్వబోగా అటెండర్ శ్రీనివాసులురెడ్డి తీసుకొనేలా చేసి ఆ మొత్తాన్ని నాలుగు కాళ్ల మండపం వద్ద గల ఓ జ్యూవెలరీ షాపులో కట్టి రమ్మనగా ఎసిబి అధికారులు అతన్ని అదుపులోకి తీసుకొని ద్రావకంలో అతని చేతులు ముంచగా రంగు మారిపోవడంతో అదుపులోనికి తీసుకొన్నారు. అటెండర్ డబ్బు మధుది అని చెప్పగా అతన్ని, ఆయన సహాయకుడు బాబురావును అదుపులోనికి తీసుకొన్నారు. విచారణ అనంతరం 23వ తేది అవినీతి పరులైన ఈ అధికారులను ఎసిబి న్యాయమూర్తి ముందు హాజరు పర్చారు.

కాకాణి ఇంట్లో లేని వైఎస్ ఫోటో!

ఇటీవల వరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ జిల్లా కన్వీనర్ బాధ్యతలు నిర్వర్తించిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇంట్లో స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫోటోలేని విషయం చర్చనీయాంశమయ్యింది. నెల్లూరు డైకస్ రోడ్డులోని ఆయన ఇంట్లో వాళ్ల నాన్న రమణారెడ్డి ఫోటోతోపాటు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఫోటోలు మాత్రమే ఉంటాయి. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫోటోకు చోటివ్వని విషయాన్ని ఆ పార్టీ నేతలే చర్చించుకొంటున్నారు.

జెండావీధిలో బ్యాండు మేళం!

నెల్లూరు జెండావీధిలో ముస్లిం మైనార్టీ సోదరులు ఎక్కువగా వుంటారు. వీళ్లను ఇళ్ల నుంచి బయటకు రప్పించాలంటే బ్యాండు మేళం మోగించాల్సిందే. వైకాపా సిటీ ఇన్‌ఛార్జ్ పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ 20, 21, 22 తేదీల్లో జెండావీధిలో పర్యటించారు. ఈయనకు ముందు దడబడలు చేస్తూ బ్యాండు మేళం వెళ్తుండగా వెనుక అనిల్ కుమార్ సాగించిన ప్రజాదీవెన యాత్ర విజయవంతమయ్యిందనే చెప్పొచ్చు.

వెంకటగిరి నుంచి పోటీకి రెడీ!

ప్రజలు ఆశీర్వదిస్తే వెంకటగిరి నియోజకవర్గం నుంచి వచ్చే ఎన్నికల్లో పోటీచేస్తానని నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి ప్రకటించారు. 21వ తేదీ వెంకటగిరికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన తండ్రి జనార్దన్‌రెడ్డి, తల్లి రాజ్యలక్ష్మమ్మలను వెంకటగిరి ప్రజలు ఆశీర్వదించబట్టే రాజకీయాల్లో ఉన్నత స్థానాలకు ఎదిగారన్నారు.

చందాదారులకు మనవి

- చందా పంపించేటప్పుడు తమ చందా నెంబరు, పూర్తి పేరు, చిరునామా తెలియపరచండి.
- మీ చందా నెంబరు, చందా ఏ తేదికి అయిపోతుందో, అడ్రసు రేపరు మీదనే ముద్రించి వుంటుంది.
- 'జమీన్‌రైతు' చందాదార్లు తమ చందాను ఎం.ఓ/డి.డి లేదా Onlineలో ఆంధ్రాబ్యాంక్, విఆర్‌కాలేజ్ బ్రాంచి, నెల్లూరు అకౌంట్ నెంబర్: 106811011000423లో ZAMINRYOT పేరుతో జమచేయవచ్చు. సకాలంలో చందా చెల్లించవలసినదిగా కోరుతున్నాము.
- చెక్కులు స్వీకరించబడవు.

జీవిత చందా రూ.1000/-

సంవత్సర చందా

స్వదేశంలో రూ.200/-

విదేశాలకు రూ.1000/-

జమీన్‌రైతు

పాగతోట, నెల్లూరు - 524 001

ఫోన్: 0861 - 2327354

సెల్: 98489 66190

తెలుగుదేశం భేటీ!

తెలుగుదేశం పార్టీ జిల్లా సమన్వయ కమిటీ సమావేశం 21వ తేది నెల్లూరు మినీ బైపాస్ రోడ్డులోని ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర అధ్యక్షతన జరిగింది. 27వ తేది చంద్రబాబు పాదయాత్ర విశాఖపట్నంలో ముగుస్తున్నందున దానిలో పాల్గొనేందుకు జిల్లా నుంచి రెండు రైళ్లలో తరలి వెళ్లాలని తీర్మానించారు. విద్యుత్ ఛార్జీల పెంపకానికి వ్యతిరేకంగా చేస్తున్న ప్రజల సంతకాల సేకరణ ఉద్యమాన్ని ఈ వారంలో ముగించాలన్నారు. జిల్లాలో విద్యుత్ కోతలు ఆర్థిక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకటన తర్వాత పెరగడాన్ని సమావేశం తప్పు పట్టింది. ఈ సమావేశంలో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పార్టీ ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పరసా రత్నం, పార్టీ జిల్లా పరిశీలకులు గంటుపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నెల్లూరులో ఎసిబి డిజి!

ఎసిబి డైరక్టర్ జనరల్ ప్రసాదరావు 21వ తేది నెల్లూరు వచ్చారు. జడ్పీ సమావేశ మందిరంలో తాను వ్రాసిన 'పర్డ్ పవర్ టూ మైండ్ పవర్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అవినీతి అధికారుల భరతం పడతాం. అవినీతికి పాల్పడుతున్న వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. అవినీతి అధికారులపై ఫిర్యాదుచేసే సమయంలో ప్రజలు ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. రాష్ట్రంలో మద్యం మాఫియాపై ఏసిబి అధికారులు 48 కేసులు నమోదు చేశారని, ఒక్క కేసు కోర్టులో ఉందని, 1128 మంది అధికారులపై చర్యల కోసం ప్రభుత్వానికి సిఫార్సు చేశామన్నారు. మద్యం సిండికేట్ల కేసుల దర్యాప్తులో ఎసిబి అధికారులు బిజీగా ఉండడం వల్ల ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు, దాడుల వ్యవహారాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

శ్రీశ్రీ 103వ జయంతి సభ

మహాకవి శ్రీశ్రీ 103వ జయంతి సభను నెల్లూరులోని శ్రీశ్రీ ప్రగతి ట్రస్టు, వర్ధమాన సమాజం సంయుక్త యాజమాన్యాన 30వ తేది సాయంత్రం టౌన్ హాల్‌లో జరుగుతుంది. ఈ సభకు మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షత వహిస్తారు. సాహితీవేత్తలు డాక్టర్ పి.సంజీవమ్మ (కడప), సింగమనేని నారాయణ(అనంతపురం), డాక్టర్ తెలికవల్లి సుబ్బయ్య ఉపన్యాసకులుగా విచ్చేస్తారు. శ్రీశ్రీ అభిమానులను ఈ సభకు విచ్చేసి జయప్రదం చేయమంటున్నారు నిర్వాహకుడు సీనియర్ న్యాయవాది వేములపాటి అనంత రామయ్య.

వెలగ చెట్టు సంఘంలో హత్య!

నెల్లూరు వెలగ చెట్టు సంఘంలో 20వ తేది అర్ధరాత్రి జరిగిన దుడ్డు వేమనకుమార్ పాశవిక హత్యోదంతం నగరంలో సంచలనం సృష్టించింది. మావిళ్లపాడుకు చెందిన వేమనకుమార్ నెల్లూరులో సెంట్రింగ్ పనులు చేసేవాడు. ఈయన భార్య స్వప్న బధిరురాలు. జెండావీధిలో మరో మహిళతో ఉన్న వివాహేతర సంబంధం మూలంగా ముగ్గురు వ్యక్తులు ముసుగులు ధరించి వచ్చి మరీ కత్తులతో వేమనకుమార్ శరీరాన్ని ఛిద్రం చేశారట. భార్య కళ్ల ముందే ఈ దారుణం జరిగింది. హత్యకు దారి తీసిన పరిస్థితులపై బాలాజీనగర్ పోలీసులు లోతు దర్యాప్తు చేస్తున్నారు.

స్త్రీలపై లైంగిక దాడులను ఖండిస్తూ సభ!

స్త్రీలపై లైంగిక దాడులను నిరసిస్తూ నెల్లూరు సుబేదారుపేటలోని ప్రాథమిక పాఠశాలలో కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ నేతృత్వంలో సభ జరిగింది. వరదా శ్రీనివాసులు, టంగుటూరు మహబూబ్, ముదిగొండ శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, చక్రపాణిలు ఢిల్లీ లైంగిక దాడుల నగరంగా మారడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో లైంగిక దాడికి గురైన బాలికకు ముదిగొండ శ్రీనివాసులు 25వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఢిల్లీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ ద్వారా అందివ్వనున్నట్లు ప్రకటించారు.

జాతీయ పోటీలకు నెల్లూరు పిఇటి!

కేరళలోని త్రివేంద్రంలో మే 10, 11, 12 తేదీల్లో జాతీయస్థాయిలో జరిగే అథ్లెటిక్స్ పోటీలకు రెఫరీగా కొడవలూరు మండలం కొత్తవంగల్లు హైస్కూల్ పిఇటి ఈ.రామచంద్ర ఎంపికయ్యారు. రాష్ట్రం నుంచి ఈ పోటీలకు ఎంపిక చేసిన ఏకైక రెఫరీ రామచంద్ర. రామచంద్రను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.వి.శివకుమార్, స్థానిక సాయిబాబా మందిర కమిటీ సభ్యులు కృష్ణ, రామచంద్రయ్య, కృష్ణయ్య, వెంకయ్య అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో విశ్వసాయి తడాఖా!

నెల్లూరు అన్నమయ్య సర్కిల్ వద్ద

కొరవ 14వ పేజీలో

బ్రాహ్మణ వివాహ సంబంధాలకు

: సంప్రదించండి :

Cell: 92476 85582

email : svsmarriagelinks@live.com

వజ్రం - బంగారం - వెండి ఫ్యాక్టరీ అవుట్‌లెట్

BIS 916 హాల్‌మార్క్ బంగారు ఆభరణములపై*

తరుగు 6% నుండి - కూలి లేదు.

వెండి వస్తువులపై*

తరుగులేదు - కూలిలేదు.

డైమండ్స్ పై 10% తగ్గింపు*

*T&C Apply

గోల్డ్ ప్యాలెస్

ఆచారివీధి, హోటల్ శివం ఎదురుగా, జిల్లా పరిషత్ ఆఫీస్ సెంటర్, నెల్లూరు.

ఫోన్: 2331133, 2327611

సిల్వర్ ఫ్యాక్టరీ అవుట్‌లెట్

925 STERLING SILVER* EXPORT QUALITY

వెండి వస్తువులపై*

తరుగు లేదు, కూలి లేదు.

*T&C Apply

సిల్వర్ ప్లాజా

EXCLUSIVE SILVER SHOW ROOM

(A Unit of Gold Palace)

ఆచారివీధి, హోటల్ శివం ఎదురుగా, జిల్లా పరిషత్ ఆఫీస్ సెంటర్, నెల్లూరు.

ఫోన్: 2331132, 2331121

ప్రజల సమస్యలు పరిష్కరించండి!

● కార్పొరేషన్ ఉద్యోగులకు ప్రత్యేకాధికారి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎజెసి పెంచలరెడ్డి.

నెల్లూరు నగర ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించడంలో అలసత్వం వహించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని అదనపు జాయింట్ కలెక్టర్, కార్పొరేషన్ ప్రత్యేక అధికారి అయిన చల్లా పెంచలరెడ్డి సుతిమెత్తగా హెచ్చరించారు. 18వ తేది కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఒక్కొక్క విభాగానికి చెందిన అధికారులు, సిబ్బందితో వారి నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు వారు చేస్తున్న సేవల గూర్చి అడిగి తెలుసుకొన్నారు. నెల్లూరు నగర ప్రజలకు త్రాగునీరు సరఫరా, పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వహించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్పొరేషన్‌కు సంబంధించిన శానిటేషన్ వాహనాలు, జెసిబి తదితర వాహనాలు పనిచేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. వారం రోజుల్లో అన్ని వాహనాలు పూర్తి కండిషన్‌లో ఉండే విధంగా చూడాలన్నారు. నగరంలో ఎక్కడా కలుషిత నీరు రాకుండా ఇంజనీరింగ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రెవిన్యూ వసూళ్లలో అలసత్వం లేకుండా వసూలు చేయాలన్నారు. అక్రమ నిర్మాణాలు ఎక్కడ జరిగినా వాటి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జ్ కమిషనర్ సంపత్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ కె.భాగ్యలక్ష్మి, హెల్త్ ఆఫీసర్ సుబ్బరాజు, సిటీ ప్లానింగ్ అధికారి వరప్రసాద్, శానిటేషన్ సూపర్‌వైజర్ శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరులో బిజెపి నిరసన!

ఉగ్రవాదం పీచమణచాలని డిమాండ్



విఆర్‌సి వద్ద ధర్నా చేస్తున్న మిడతల రమేష్ బృందం.

బెంగుళూరులో ఉగ్రవాదులు బిజెపి కార్యాలయం వద్ద బాంబులు పేల్చినందుకు నిరసనగా నెల్లూరు బిజెపి నాయకులు ప్రదర్శనచేసి విఆర్‌సి సెంటర్‌లో ఉగ్రవాద దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బిజెపి నేత మిడతల రమేష్ మాట్లాడుతూ బెంగుళూరు పేలుళ్లను బిజెపి రాజకీయంగా వాడుకుంటోందని కాంగ్రెస్ నాయకుడు షకీల్ అహ్మద్ ప్రకటించడం ఆ పార్టీ కుహనా లౌకికవాదానికి అద్దం పడుతుందన్నారు. ఇస్లామిక్ తీవ్రవాదులు బిజెపి నాయకులను టార్గెట్ చేసుకున్నారనేందుకు బెంగుళూరు బిజెపి కార్యాలయం వద్ద బాంబులు పేల్చడమే నిదర్శనమని చెప్పారు. హైదరాబాద్ దిల్‌షుక్‌నగర్ బాంబుపేలుళ్ల దర్యాప్తు పూర్తి కాకముందే బెంగుళూరులో పేలుళ్లకు ఉపయోగించిన మోటారు సైకిల్ హైదరాబాద్‌కు చెందినదిగా గుర్తించడం ప్రజల్లో ఆందోళన కల్గిస్తుందన్నారు. జాతీయ ఛానళ్ల సర్వే ప్రకారం బిజెపి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో అతిపెద్ద పార్టీగా అవతరిస్తుందని ప్రకటించిన కొద్ది క్షణాలకే మానవ బాంబుల ద్వారా భారీ విస్ఫోటనానికి ఉగ్రవాదులు ప్రయత్నించడం బిజెపి నాయకత్వానికి తీవ్రవాదులు హెచ్చరిక చేసినట్లుగా ఉందన్నారు. ఉగ్రవాదం విషయంలో ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధిగా వ్యవహరించి కఠినంగా అణచి వేయాలని డిమాండ్ చేశారు.

● రామనారాయణరెడ్డికి

ప్రజలే బుద్ధి చెబుతారు!

రామనారాయణరెడ్డి రాజకీయ ఉన్నతికి కారకుడైన స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబాన్ని అనవసరంగా నిందించిన ఆర్థిక మంత్రికి ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెబుతారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. నెల్లూరులోని తన స్వగృహంలో 18వ తేది విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. ఆ విధంగా మాట్లాడను ఆయనకు నోరెలా వచ్చిందో అర్థం కాలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికకు దేశంలోనే చట్టబద్ధత కల్పించిన ఘనత తమదేనంటూ రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా వుందన్నారు. దీనివల్ల దళితులకు గిరిజనులకు స్థూలంగా ఒనగూడే ప్రయోజనం ఏమీ లేదన్నారు. అమృత హస్తం అమలు చేస్తున్నట్లుగా చెబుతున్నా కందిపప్పు, బియ్యం జిల్లాలోని ఏ అంగన్‌వాడీ కేంద్రంలోనూ సరకు లేదన్నారు. గర్భిణులకు, బాలింతలకు కేవలం పాలు, గుడ్లు మాత్రమే ఇచ్చి పంపుతూ నెలలు నెలలుగా ఇదే సర్దుబాటు చేస్తున్నారని ఆరోపించారు. అమ్మ హస్తం పేరిట అందజేస్తున్న పామోలిన్ నూనె వినియోగించిన లబ్ధిదారులకు కీళ్లవాతం వంటి రోగాలు వస్తున్నాయన్నారు. విలేకరుల సమావేశంలో పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, అనిత పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి. ప్రక్కన కొమ్మి లక్ష్మయ్యనాయుడు, అనిల్‌కుమార్ యాదవ్.

క్రికెట్ బెట్టింగ్‌ల జోరు!

నష్టపోతున్న అమాయకులు

జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌ల జోరు అధికమయ్యింది. ఐపిఎల్ సీజన్ ప్రారంభం కావడంతో క్రికెట్ అభిమానులందరినీ క్రికెట్ ఫీవర్ పట్టుకొంది. దీనిని ఆసరా చేసుకుని బెట్టింగ్ ముఠాలు రంగంలోకి దిగి లక్షల్లో ఈ వ్యవహారాన్ని నడిపిస్తుండడంతో బెట్టింగ్‌లు మూడు ఫోర్లు, నాలుగు సిక్సర్ల చందంగా నడుస్తోంది. ఇలాంటి క్రికెట్ బెట్టింగ్‌లలో చేయి తిరిగిన పలువురు నగరంలో వుంటూ తమ కార్యకలాపాలు గుట్టుచప్పుడు కాకుండా నడిపిస్తుండడంతో పలువురు క్షణాల్లో డబ్బు సంపాదించవచ్చన్న ఆశకు లోనై దెబ్బతిని పోతున్నారు. రాజకీయ పార్టీల అండదండలున్న వారు, చోటా మోటా నేతలు, బంగారు అంగళ్ల వద్ద సెటిల్‌మెంట్లు చేసే వ్యక్తులు, మాజీ ప్రజాప్రతినిధుల బంధువులు ఇలా పలువురు బెట్టింగ్ నిపుణులుగా ప్రసిద్ధి చెందిన వ్యక్తులు ఈ ఐపిఎల్ మ్యాచ్‌లను తమ ఆదాయ వనరుగా మార్చుకొని అమాయకులు, క్రికెట్ ఆటపై ఆసక్తిగల వారికి ఆశచూపి నిలువునా ముంచేస్తున్నారు. ఆటోనగర్, అయ్యప్పగుడి, పొదలకూరురోడ్డు, రంగనాయకుల పేట, చిన్నబజారు, మూలాపేట, ఎసి సెంటర్ ఇలా పలు ప్రాంతాల్లో స్థావరాలను ఏర్పాటు చేసుకుని బెట్టింగ్ కార్యకలాపాలు నిరాటంకంగా కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఆయా ప్రాంతాలలో సెల్‌ఫోన్ సర్వీసింగ్ సెంటర్లు, కొరియర్ పాయింట్లు, స్వీట్ షాపులు, టివి రిపేరు షాపులు ఇలాంటి షాపులను కేంద్రంగా చేసుకుని బుకీలు బెట్టింగ్‌లను ఆయా వ్యక్తుల వద్ద నుంచి డబ్బులు అందుకొంటూ ఈ తతంగాన్ని నడిపిస్తున్నారట. ఏ రోజు ఏ జట్టు గెలుస్తుంది. ఏ జట్టు ఓడిపోతుంది, ఏ ఆటగాడు ఎంత స్కోర్ చేస్తాడు, ఎన్ని ఫోర్లు కొడతారు, ఎన్ని సిక్సులు కొడతారు, ఎన్ని వికెట్లు పడగొడతారు ఇలా రకరకాల వాటిపై బెట్టింగ్‌లు కాస్తున్నట్లు సమాచారం. ఒకటి రెండు సందర్భాలలో కొంత డబ్బు గెలుచుకున్నప్పటికీ బెట్టింగ్‌లు పెట్టి నష్టపోతున్న వారే అధికంగా వుంటున్నారు. కావలి డిఎస్పీ గన్‌మెన్ ఇందులో కీలకంగా వ్యవహరిస్తున్న విషయం బట్టబయలైంది. కొందరు పోలీసులు వీరికి సహకరిస్తుండడంతో విస్తృతంగా సాగుతోంది ఈ వ్యవహారం.

విపత్తులను ఎదుర్కోవడంపై శిక్షణ!



శిక్షణలో పాల్గొన్న అధికార యంత్రాంగం.

నెల్లూరు విఆర్ కాలేజిలోని ఇగ్నోస్టడీ సెంటర్‌లో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిర్వహణపై వివిధ ప్రభుత్వ శాఖల్లోని అధికారుల, పంచాయితీ రాజ్ సంస్థల ప్రతినిధులకు ముఖాముఖి శిక్షణా తరగతులు నిర్వహించాయి. ఎన్‌డిఎంఏ, ఇగ్నో సంయుక్తంగా ఈ శిక్షణా తరగతులు నిర్వహించారు. 250 మందికి పైగా వివిధ ప్రభుత్వ శాఖలు, పంచాయితీరాజ్ శాఖ అధికారులు వీటికి హాజరయ్యారు. ఈ శిక్షణా శిబిరానికి డక్కిలి మండలాధికారి సుస్మిత నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. ఉమన్ ఇన్ నీడ్ సంస్థకు చెందిన గీతాకృష్ణ, అసోసియేషన్ ఆఫ్ రిలీఫ్ వాలంటీర్స్ గ్రూప్‌కు చెందిన మహిపాల్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి, డిఆర్వో రామిరెడ్డి, తహశీల్దార్ వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమం విజయవంతంకాను సహకారమందించినట్లు నెల్లూరు ఇగ్నో స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ నరేంద్రనాధ్‌రెడ్డి, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ నితిన్ చెప్పారు.

ఉపాధి హామీ పనులకు అడ్వాన్స్!

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలోని గిరిజనులకు వారానికి 300 రూపాయలు అడ్వాన్స్ చెల్లింపులు జరుపనున్నారు. తొలి విడతలో అల్లూరు, విడవలూరు, కొడవలూరు, దివి సత్రం, నాయుడుపేట తదితర మండలాల్లో అడ్వాన్స్ చెల్లింపులు చేస్తారు. ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించేందుకు జాబ్ కార్డులు జారీ చేస్తారు. వీటితోపాటు రోజువారీ కూలీతో పనిలేకుండా వారానికి 300 రూపాయలు అడ్వాన్స్‌గా చెల్లించాలని అధికారులు నిర్ణయించారు. ఇటీవల జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, డ్వామా ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ప్రత్యేకంగా సర్వే నిర్వహించి గిరిజనులను గుర్తించేందుకు ఇందిర క్రాంతి పథం సిబ్బంది కృషి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మండల స్థాయిలో ఎంపిడిఓలు ఉపాధి హామీ పథకం విధుల నుంచి తప్పుకోవడంతో ప్రస్తుతం ఎపిఓల ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆశించిన మేర పనులు జరగక పోవడం, సక్రమంగా కూలీలకు నగదు చెల్లింపులు చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గిరిజనులకు అడ్వాన్స్‌గా నగదు చెల్లించాలని అధికారులు ఆదేశాలు ఏ మేరకు అమలు చేస్తారో వేచి చూడాలి.



రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్ నమూనా.

● గౌరవరంలో

రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్!

కావలి ప్రాంత విద్యార్థులకు చక్కని అవకాశం

కావలి పట్టణానికి సమీపంలో గల గౌరవరం గ్రామంలో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటవుతోంది. జాతీయ రహదారిని ఆనుకొని వున్న ఈ పాఠశాల షుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో అన్ని మౌలిక సదుపాయాలతో, ఏర్పాటవుతుండడం విశేషం. ఇప్పటికే ఇంజనీరింగ్ కళాశాల నిర్వహణలో మంచి పేరు ప్రఖ్యాతులు సాధించిన రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కాలేజి యాజమాన్యం ఆధ్వర్యంలోనే ఈ స్కూల్ ఏర్పాటవుతోంది. ఈ స్కూల్ నిర్మాణం గురించి, ప్రత్యేకతల గురించి చైర్మన్ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వివరించారు. చదువనేది కష్టపడి కాకుండా ఇష్టపడి చదివేలా విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తూ విద్యాబోధన సాగుతుందన్నారు. చక్కని విద్యాబోధనతోపాటు విద్యార్థులు అన్ని రంగాల్లో రాణింపబడేలా క్రీడలు, మ్యూజిక్, డ్యాన్స్ తదితర అంశాల్లోను శిక్షణ ఇస్తామన్నారు. విశాలమైన తరగతి గదులు, విద్యార్థుల సంఖ్యకు తగినట్లు ఉపాధ్యాయుల నియామకం, విజ్ఞానాన్ని పెంపొందించుకొనేందుకు అతిపెద్ద లైబ్రరీ, అత్యాధునిక ప్రయోగశాల ఏర్పాటు చేశామన్నారు. ఒత్తిడిలేని విద్యావిధానాన్ని అమలు చేయనున్నామన్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తూ ఆర్ఓ సిస్టం ద్వారా శుద్ధి చేయబడిన త్రాగునీటికి ఖర్చుకు వెనుకాడకుండా అందిస్తున్నామన్నారు. విద్యుత్ అంతరాయం కలుగకుండా వుండేందుకు జనరేటర్ సదుపాయం, స్విమ్మింగ్‌పూల్ ఏర్పాటు చేశామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యాబోధన చేసేందుకు క్వాలిఫైడ్ ఉపాధ్యాయ బృందాన్ని నియమించామన్నారు. రానున్న రోజుల్లో తమ పాఠశాల చక్కని విద్యకు చిరునామాగా గుర్తింపు పొందుతుందన్నారు.

కావలి కేంద్రంగా ఆర్థిక నేరాలు!

చెత్త సంస్థలన్నీ పురుడు పోసుకొన్నదిక్కడే!

కావలి పట్టణంలో పుట్టగొడుగుల్లా వివిధ సంస్థలు పుట్టుకరావడం, ప్రజలను నమ్మించి నట్టేట ముంచడం ఇటీవల అధికమయ్యాయి. మొన్న మనీస్కీం పేరుతో కోట్ల రూపాయలు ప్రజల నుంచి వసూలు చేసి దగా చేసిన విషయం తెలిసిందే. ఇటీవల కాలంలో ఎన్‌మార్ట్ పేరుతో పెద్ద ఎత్తున నగదు కట్టించుకొని, ఆ మొత్తానికి సరుకులు ఇస్తామని చెప్పి బోర్డు తిప్పేయడంతో బాధితులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకోనే వారే లేకుండా పోయారు. కావలి, బిట్రగుంట, అల్లూరు, జలదంకి, కొండాపురం తదితర మండలాల్లో ఈ సంస్థలో అధికమొత్తం వస్తుందని ఆశపడి డబ్బులు కట్టినవారు అధికంగా వున్నారు. వీరిలో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలే ఎక్కువ మంది వున్నారు. షుమారు 3వేల మందికిపైగా ఎన్‌మార్ట్‌లో డబ్బులు కట్టి వున్నట్లు సమాచారం. నిర్వాహకులు మొండి చేయి చూపడంతో బాధితులు లబోదిబో మంటున్నారు. మనీస్కీం వ్యవహారం ఇప్పటివరకు ఒక కొలిక్కి రాలేదు. చిత్ర విచిత్రమైన మలుపులు తిరుగుతోంది. ఈ రెండు కేసులో కీలక వ్యక్తులు మాత్రం దర్జాగా తిరుగుతుండడం, తమ గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని, న్యాయం చేయడం లేదని బాధితులు వాపోతున్నారు.

విద్యుత్ కోతలతో బుచ్చి వాసుల బెంబేలు!

రోజుకు 15 గంటల విద్యుత్ కోత

బుచ్చిరెడ్డిపాళెంలో ఏకబిగిన 15గంటలపాటు విద్యుత్ కోత విధించడంతో ప్రజలు అల్లాడిపోయారు. సాధారణంగా విధించే విద్యుత్ కోతలు కాకుండా సుదీర్ఘంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో పట్టణ ప్రజలు పడుతున్న బాధలు అన్నిఇన్నికావు. మంచినీటికి, ఇతరత్రా అవసరాలకు మోటార్లు, బోర్లు పనిచేయక ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఒకవైపు మండుతున్న ఎండలు భరించలేని ఉక్కపోతకు తోడు 15 గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో వృద్ధులు, పిల్లలు తట్టుకోలేకపోయారు. దీనిపై విద్యుత్‌శాఖాధికారులను ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బిల్లుల వసూళ్లపై చూపే శ్రద్ధ విద్యుత్ సరఫరాపై చూపడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రతిపక్ష పార్టీలు దీనిపై పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

మెరుగు పేరుతో నగల అపహరణ!

తస్మాత్ జాగ్రత్త సుమా!

నగల మెరుగు పేరుతో బంగారాన్ని తస్కరించిన ఘటన కంటోపల్లి గ్రామంలో చోటుచేసుకొంది. స్థానికంగా నివాసం వుండే గురుస్వామి ఇంటికి ఇటీవల కాలంలో ఇద్దరు యువకులు వచ్చి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు మెరుగు పెడతామని నమ్మబలికారు. వారి మాటలు నమ్మిన కుటుంబసభ్యులు ఇంట్లోని నగలు, వెండి వస్తువులు తెచ్చివ్వగా శుభ్రపరుస్తున్నట్లు నటించి యజమానుల కళ్లుగప్పి ఉడాయించారట. ఆలస్యంగా తేరుకొన్న కుటుంబసభ్యులు వారి కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించి జరిగిన మోసాన్ని వెల్లడించారు. రూరల్ సిఐ సుధాకర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేపట్టారు.

మరుగుదొడ్ల నిర్మాణాల్లోనూ అవినీతి

విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో వుంచుకొని పాఠశాలల్లో చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణాల్లో అవినీతి అడుగడుగునా దర్శనమిస్తోంది. పరమ నాసిరకంగా ఈ నిర్మాణాలు చేపట్టడంతో వీటిని కట్టిన కొద్ది కాలానికే వీటి బండారం బయటపడింది. కావలి నియోజకవర్గంలో నిర్మించిన ఈ మరుగుదొడ్లను పరిశీలిస్తే ఈ వ్యవహారం కళ్లకు కట్టినట్లు కన్పిస్తుంది. టాయిలెట్ షీట్లు వేసిన నాలుగు రోజులకే పగిలిపోయాయి. తలుపులు పగిలిపోయి, గడియలు ఊడిపోయి, గోడలు నెర్రులుబారి అవినీతిని నగ్నంగా బయటపెడుతున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ మరుగుదొడ్లు కాంట్రాక్టర్లు, అధికారుల అవినీతి కారణంగా ప్రభుత్వ ఉద్దేశం, ప్రజాధనం వృధా అవుతోంది. నాసిరకంగా నిర్మించిన మరుగుదొడ్ల వలన తమకు ఎలాంటి ఉపయోగం లేదని, ఒట్టూరు గ్రామ ప్రజలు, విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

శుష్క వాగ్దానాల మంత్రి!

ఆనంను విమర్శించిన మేకపాటి



జిల్లా ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డి శుష్క వాగ్దానాలతో, ఆచరణకు నోచుకోని హామీలతో ప్రజలను మభ్యపెడుతున్నారని నెల్లూరు ఎమ్పీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి విమర్శించారు. ఇటీవల వింజమూరు వచ్చిన ఆయన మాట్లాడుతూ మంత్రిపై పరోక్ష విమర్శలు చేశారు. ఉదయగిరి నియోజకవర్గంలో సాగునీరు, త్రాగునీరు అందించేందుకు సోమశిల హైలెవల్ కెనాల్‌కు ముఖ్యమంత్రి ఇటీవల జిల్లా పర్యటన సందర్భంగా శంకుస్థాపన చేయడం శుభపరిణామన్నారు. కానీ అది కేవలం శిలాఫలకానికే పరిమితమవుతుండడం బాధాకరమన్నారు. బడ్జెట్‌లో ఈ కెనాల్‌కు నిధులు కేటాయించకుండా, సమగ్ర సర్వే చేయకుండా, గ్రావిటీ లెవల్ పరిశీలించకుండా హామీలు గుప్పించడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. చిత్తశుద్ధి లేకుండా ఓట్లకోసం, ప్రజలకు తామేదో చేసేశాం అని చెప్పుకోవడానికి బాగుంటాయి తప్ప ఇలాంటి వాటి వలన ప్రయోజనం శూన్యమని విమర్శించారు. అలాగే వైఎస్ జగన్‌పై ఆనం చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆనం వెంకటరమణారెడ్డి, గణపం బాలకృష్ణారెడ్డి, విజయకుమార్‌రెడ్డి, రమణారెడ్డి, నరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పాఠశాల ప్రభవ!

పిల్లలలో సృజనాత్మకతను వెలికి తీస్తారు



పిల్లలకు ఆడిస్తూ, లాలిస్తూ పాఠాలు చెబుతున్న చంద్రలత.

వినూత్న కార్యక్రమాలతో, ప్రత్యేక శిక్షణలతో పిల్లల్లో దాగి వున్న ప్రతిభాపాటవాలను వెలికితీస్తోంది ప్రభవ. నెల్లూరు పొగతోటలో ఏర్పాటైన ఈ పాఠశాల పిల్లలకు ఆట పాటలకు పసి బడిగా, తొలి బడిగా మారి పేరు ప్రఖ్యాతులు ఆర్జించింది. ప్లే స్కూలు, ప్రి ప్రైమరీ విద్యను అందిస్తున్న ప్రభవలో అడుగుపెడితే పిల్లలే సారధులుగా వుంటూ చదువు కోవడంతోపాటు ఆటపాటల్లోను తర్ఫీదు పొందుతుండడం కన్పిస్తుంది. ప్రభవ నిర్వాహకురాలు, రచయిత్రి కూడా అయిన చంద్రలత ప్రభవ ఏర్పాటు చేయడం గురించి వివరిస్తూ ప్రఖ్యాత తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి ఏర్పాటు చేసిన రిషివ్యాలీ విద్యాకేంద్రం నుంచి ప్రేరణ పొంది ఇక్కడ పిల్లలకు విద్యతోపాటు సమగ్ర వికాసం కలిగించారన్న ఉద్దేశంతో దీనిని రూపొందించడం జరిగిందన్నారు. పిల్లల కోసం చేసే కార్యక్రమాలలో వారి భాగస్వామ్యం వుంటేనే అది సమగ్రంగా వుంటుందని, పిల్లలు ఆసక్తి కనపరుస్తారన్న ఉద్దేశంతో ఇక్కడ శిక్షణ పొందే విద్యార్థులనే బడికి బాలరధ సారధులుగాచేసి ఒక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. సృజనాత్మకత విషయంతో వర్క్‌షాపులు నిర్వహించడం, లండన్‌కు చెందిన ట్రినిటి కాలేజ్ సహకారంతో ఆంగ్లబాషా బోధన చేస్తున్నామన్నారు. ప్రముఖ న్యాయవాది వి.అనంతరామయ్య, రిషివ్యాలీస్కూలు ప్రిన్సిపాల్ డాక్టర్ కుమార్‌స్వామి, డైరెక్టర్ రమారావు, విఆర్‌హైస్కూలు రిటైర్ ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి, ప్రముఖ చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ శ్రీధర్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ శోభాదేవి అడ్వయిజరీ బోర్డులో వున్నారని వీరి సలహాలు సూచనలతో ప్రభవను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు.



నెల్లూరు హాస్యనటుడు దోర్నాల హరిబాబుకు ఢిల్లీ తెలుగు అకాడమీ ఉగాది పురస్కారాన్ని అందిస్తున్న తమిళనాడు గవర్నర్ కొణిజేటి రోశయ్య. ప్రక్కన రాష్ట్రమంత్రి కాసు కృష్ణారెడ్డి.

● కావలి

డిఎస్పీ గన్‌మెన్‌పై దొంగల దాడి!

కప్పరాళ్ల తిప్పా... మజాకానా?

దొంగతనానికి పాల్పడుతున్న వారిని పట్టుకొనేందుకు ప్రయత్నించిన డిఎస్పీ గన్‌మెన్‌పై దొంగలు దాడి చేయడం కలకలం రేపింది. కావలి డిఎస్పీ ఇందిర నెల్లూరు నుంచి కావలి వస్తుండగా దగదర్తి మండలం ఉలవపాళ్ల, తిప్ప మధ్య జాతీయ రహదారిపై వున్న లారీల్లో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేస్తున్నారు. ఇది గమనించిన డిఎస్పీ గన్‌మెన్ ప్రసాద్‌రెడ్డి వారిని పట్టుకొనేందుకు అక్కడికి వెళ్లగా వాళ్లు అతనిపై తిరగబడ్డారు. రాళ్లతో గన్‌మెన్‌పై దాడి చేయడంతో అతని ముఖంపై గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కావలి పోలీసులు అక్కడకు చేరుకొని ఆ ప్రాంతమంతా గాలించిన దొంగలు దొరకలేదు. దొంగల చేతిలో గాయపడ్డ గన్‌మెన్ ప్రసాద్‌రెడ్డిని ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన చుట్టుప్రక్కల ప్రాంతాలలో సంచలనం కల్గించింది. డిఎస్పీ సమక్షంలోనే దొంగలు ఏకంగా గన్‌మెన్‌పై దాడి చేసి పారిపోయారంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటా? అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు జాతీయ రహదారిపై పెట్రోలింగ్ పెంచాల్సి వుంది.

● ప్రచారానికి

కోట్లాది రూపాయల ఖర్చు!

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు తీరుపై విమర్శ

అణంగా ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి పాటుపడుతున్నామని చెప్పే ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకు కోట్ల రూపాయలు ఖర్చు చేయడం ఎంతవరకు సమంజసం అని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి ప్రశ్నించారు. ఇటీవల బోగోలులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పేరుతో దళితులు, గిరిజనులను ప్రభుత్వం మోసం చేస్తున్నాదని విమర్శించారు. దళితులు, గిరిజనుల కోసం, వారికి ఉపయోగపడేందుకే ఈ సబ్‌ప్లాన్‌లంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్న పాలకులు ఆ పేరుతో లబ్దిపొందేందుకు, ఓట్లు రాబట్టుకొనేందుకు ప్రచారానికి కోట్లాది రూపాయలు వృధా చేయడం దారుణమన్నారు. జిల్లాలో సాంఘిక సంక్షేమ హాస్టళ్లను పరిశీలిస్తే 15కు పైగా హాస్టళ్లు పూర్తిగా దెబ్బతిని వున్నాయని, మరో 20 హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరుకొని వున్నాయన్నారు. ప్రచారానికి 5కోట్ల రూపాయలను ఖర్చు చేసిన ప్రభుత్వం, పాలకులు, అధికారులు ఆ డబ్బుతో దళిత, గిరిజన విద్యార్థులకు చక్కని చదువు చెప్పించేందుకు, హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తే మేలు కల్గుతుందన్నారు.

మర్రిపాడులో తాగునీటి ఎద్దడి!

మంచినీటి కోసం నానా పాట్లు

మంచినీటి కోసం మర్రిపాడు మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దప్పిక తీర్చుకొనేందుకు గుక్కెడు నీళ్ల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి బిందెలతో నీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మండల పరిధిలోగల మిక్స్‌డ్‌కాలనీ, బిసి కాలనీ ప్రజల త్రాగునీటి కష్టాలు అన్నిఇన్ని కావు. ఈ ప్రాంతంలో చాలాకాలంగా మంచినీటి సమస్య వుంది. ఈ సమస్యను తీర్చాలని పలుమార్లు స్థానికులు కన్పించిన అధికారికల్లా వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోయింది. గతంలో సుజలధార పథకం క్రింద బొగ్గేరు నుంచి సప్లై చానల్ ద్వారా ఈ ప్రాంతానికి త్రాగునీరు అందించే ఏర్పాట్లు చేసిన ప్పటికీ అవినీతి కారణంగా వేసిన కొద్దికాలానికే నిరుపయోగంగా మారింది. నాసిరకం పైపులు వేయడంతో ప్రారంభం రోజు నుంచి నీటిసరఫరా సక్రమంగా జరగలేదని ఈ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో మంచినీటి కోసం తాము పలు ఇబ్బందులు పడాల్సి వస్తున్నాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు మహిళలు. ఇటీవల అధికారుల తీరును నిరసిస్తూ ఖాళీ బిందెలతో మహిళలు పెద్దసంఖ్యలో ఎమ్పీడిఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.

ప్రేమ జంటలకు పోలీస్ కౌన్సిలింగ్!

కోడూరు బీచ్‌లో ప్రేమికులకు కష్టాలు

తోటపల్లి గూడూరు మండలం కోడూరు, కాటేపల్లి బీచ్‌ల వద్దకు సందర్శకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. సెలవు దినాల్లో ఈ సంఖ్య మరింత ఎక్కువగా వుంటుంది. వీరిలో ప్రేమ జంటలు అధికంగా వుంటున్నాయి. వీళ్లు ఏకాంతంగా గడిపేందుకు సముద్ర తీరానికి వస్తుండడం, అల్లరిమూకలు, త్రాగుబోతులు వీరి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండడం, గొడవలకు దారితీస్తున్న ఘటనలు కోకొల్లలు. దీనిపై దృష్టిసారించిన పోలీసులు ఇలాంటి జంటలకు ఇటీవల కౌన్సిలింగ్ ఇచ్చారు. కృష్ణపట్నం సిఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్ఐ సాంబశివరావులు గస్తీని ముమ్మరం చేయడంతోపాటు ప్రేమికులను అదుపులోకి తీసుకొని వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి పిల్లలు చేస్తున్న తప్పులను చెప్పి తల్లిదండ్రులుగా వారి బాధ్యతను గుర్తుచేసి సుతిమెత్తగా మందలించి పంపారు. పోలీసుల కౌన్సిలింగ్‌తోనైనా ఈ ప్రాంతంలో ప్రేమజంటల తాకిడి తగ్గుతుందేమో చూడాలి.

రూ.185ల ప్యాకెట్ కొంటేనే రేషన్!

బోగోలు డీలర్ల కండీషన్

పేదలకు నిత్యావసర వస్తువుల సరుకులను తక్కువ ధరకే అందిస్తామని ప్రభుత్వం ఒకవైపు ప్రకటన చేస్తుంటే, మరోవైపు అసలు రేషన్ అందని పరిస్థితి నెలకొంటుంది పలు ప్రాంతాలలో. బోగోలు మండలంలో ఈ పరిస్థితి ఏర్పడింది. రేషన్‌షాపులకు పోయిన లబ్దిదారులకు చక్కెర, నూనె లేదని సమాధానం వస్తుండడంతో తెల్లకార్డు కల్గినవారు అయోమయంలో పడిపోతున్నారు. ఇటీవల జిల్లాలకు వచ్చిన ముఖ్యమంత్రి ఉగాది నుంచి 225 రూపాయలు చేసే బియ్యం, చక్కెర, నూనె తదితర వస్తువులను 185రూపాయలకే ఇస్తున్నట్లు ప్రకటించారు. కానీ పరిస్థితి అందుకు విరుద్ధంగా వుంటోంది. దీనికి తోడు రేషన్ డీలర్లు 185 రూపాయలు పెట్టి ప్యాకెట్ కొంటేనే బియ్యం, నూనె, చక్కెర, కిరోసిన్ ఇస్తామని లేదంటే ఇచ్చేది లేదని ఖరాఖండీగా చెప్తున్నారని పేదలు వాపోతున్నారు. దీనిపై తహశీల్దార్ అంకయ్యను ప్రశ్నిస్తే స్టాక్ పాయింట్లలో చక్కెర, నూనె స్టాక్ లేదని సమాధానమిచ్చారు. అధికారులు ఒక రకంగా, రేషన్ డీలర్లు మరోకరంగా పొంతన లేని సమాధానాలు ఇస్తుండడం, మొండిచేయి చూపుతుండడంతో పేదలు రేషన్‌షాపుల చుట్టూ నిత్యావసర వస్తువుల కోసం తిరగాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

కలువాయి ఉపాధి పనుల్లో అక్రమాలు!

తనిఖీ విభాగం తేల్చి చెప్పిన నిజం.

కలువాయి మండలంలో జాతీయ ఉపాధిహామీ పథకం క్రింద చేపట్టిన పనుల్లో 12 లక్షల రూపాయలు దుర్వినియోగం జరిగినట్లు అధికారులు గుర్తించారు. వీటితోపాటు చనిపోయినవారి పేరున పింఛన్లు స్వాహా చేస్తున్న వైనం అధికారుల విచారణలో బట్టబయలైంది. మండలంలోని కుల్లూరు, తోపుగుంట గ్రామాల్లో పంచాయితీరాజ్ పరిధిలో జరిగిన ఉపాధి పనులకు ఒకేరోజు కూలీలు వెళ్లినట్లు బోగస్ మస్టర్లు వేసి వుండడం సైతం ఈ తనిఖీల్లో వెలుగు చూసింది. మండలంలో ఉపాధిసొమ్ము స్వాహాపై వచ్చిన ఫిర్యాదులపై సామాజిక తనిఖీ విభాగం రాష్ట్ర రిసోర్స్ పర్సన్ నరేష్‌కుమార్ ఇటీవల మండలంలో పర్యటించి తనిఖీ చేశారు. ఏప్రెల్ 2001 నుంచి జనవరి 2013 వరకు గ్రామాల్లో పంచాయితీ రోడ్లు, అటవీ భూముల్లో షుమారు 4 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జరగగా అందులో 12 లక్షల రూపాయలు అవినీతి జరిగిందని ఆడిట్ బృందం నిగ్గుతేల్చిందన్నారు. ఈ సొమ్ము రికవరీ కోసం అధికారులకు సిఫార్సు చేయగా కేవలం 73వేలు మాత్రమే రికవరీకి అధికారులు నిర్ణయించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయమై హైదరాబాద్ సిఆర్‌డిలో ఫిర్యాదు చేస్తానన్నారు. అలాగే మండలంలోని కేశవనేని పల్లి, చీపినాపి, చింతలాత్మకూరు, తెలుగు రాయపురం గ్రామాలలో మరణించిన 14మంది పేర పింఛన్లు దిగమింగుతున్న వారి నుంచి ఆ మొత్తం సొమ్ము రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విచారణలో ఎపిడి ప్రసాద్, భాస్కర్, అంబుడ్స్‌మెన్ పెంచలమ్మ, డ్వామా విజిలెన్సు



అధికారి దయాకర్‌రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ అధికారి రామయ్య, ఎంపిడిఓ గాయత్రిదేవి, ఎపిఓ పెంచలయ్య తదితరులు హాజరయ్యారు.

మంత్రి ఆనం దిష్టిబొమ్మ దగ్ధం!

కావలి నియోజకవర్గమంతా నిరసనలు



వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ పార్టీ నేతలు కావలి నియోజకవర్గ పరిధిలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కావలి పట్టణ పరిధితోపాటు, అల్లూరు, బోగోలు తదితర ప్రాంతాలలో మంత్రి ఆనం దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. బోగోలులో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో ఆ పార్టీ నేత తూపిలి పెంచలయ్య మాట్లాడుతూ ఆనం రామనారాయణరెడ్డికి పిచ్చిపట్టిందని విమర్శించారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ఆయనను కీర్తిస్తూ పదవులు పొంది రాజకీయంగా, ఆర్థికంగా బలపడిన ఆనం కుటుంబం నేడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబాన్ని విమర్శించడం దారుణమన్నారు. జగన్‌ను ఉరితీయాలని చేసిన మంత్రి వ్యాఖ్యలపై ప్రజల నుంచి ఛీత్కారాలు ఎదురౌతున్నాయన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు ఆనం సోదరులకు తగిన గుణపాఠం చెప్పి వారినే సమాజం నుంచి వెలివేస్తారన్నారు.

ఆరవ వర్ధంతి

మా ఇంటి దైవం, మా అభివృద్ధికి కారకురాలు



శ్రీమతి అన్నదేవుల నాగమ్మ గారు

స్వర్గస్తులై ఆరు సంవత్సరములు పూర్తవుతున్న సందర్భంగా

వారిని స్మరించుకొంటూ... శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

భర్త

అన్నదేవుల వెంకురెడ్డి

జిల్లా జడ్జి (Rtd)

కుమారులు - కోడళ్లు

డాక్టర్ ఎ.రమేష్‌రెడ్డి - డాక్టర్ ఎ. భవానిరెడ్డి

ఎ. రవి - డాక్టర్ ఎ. శశికళ

కుమార్తె - అల్లుడు

డి.రజని - డి.రాధాకృష్ణారెడ్డి

మనుమలు - మనుమరాళ్లు

రోహిత్, గహన్, వినీత్, భవ్య, నేహా, రీతిక

• ఉదయగిరిలో

చెంచలబాబు x చంద్రశేఖర్‌రెడ్డి!

ఉదయగిరిలో ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని కాంగ్రెస్‌పార్టీ నేతలు లేఅవుట్లు వేస్తున్నారని స్థానిక శాసనసభ్యుడు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి చేసిన ఆరోపణలతో అధికార కాంగ్రెస్, వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ మధ్య పరస్పర ఆరోపణల యుద్ధానికి తెర లేపింది. శివారు ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన చెంచలబాబు యాదవ్ కుటుంబం ప్రభుత్వ భూములను ఆక్రమించుకొంటున్నారని ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపణలు చేశారు. ప్రభుత్వ అధికారులను బెదరించి అధికారపార్టీ నేతలు అక్రమాలకు పాల్పడుతూ భూకబ్జాలు చేస్తున్నారని విమర్శలు చేశారు. దాదాపు 1.49కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ పార్టీ నేతలు కబ్జా చేశారన్నారు. దీనిపై మండల అధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. అధికారులు నిజాయితీగా

వినలేని విమర్శల పర్వం

విచారణ జరపాలన్నారు. త్వరలోనే తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని అప్పుడు మా సత్తా ఏమిటో చూపుతామన్నారు. మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపణలకు చెంచలబాబు కుటుంబీకుడు మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు అయిన బాల కృష్ణ ఎమ్మెల్యేపై ఎదురుదాడి చేశారు. చంద్రశేఖర్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలు అసత్యాలని కొట్టి పారేశారు. నిబంధనలకు అనుగుణంగా 5.50 ఎకరాల భూమిని కొనుగోలు చేశామే తప్ప ఎక్కడా అక్రమాలకు పాల్పడలేదన్నారు. మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి కన్నా భూకబ్జాదారులు ఎవరూ లేరని ప్రత్యారోపణలు చేశారు. ఆది నుంచి కబ్జాలు, మోసాలకు పాల్పడే మేకపాటి సోదరులు తమపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు.





వర్ధమాన మహావీరుని బోధనలు అనుసరణీయం!

ప్రపంచంలో అనేక ధర్మాలు వర్ధిల్లుతున్నాయి. అలాంటి ప్రాచీన ధర్మాల్లో ఒకటి జైనధర్మం. ధర్మాన్ని మతంగా పలకడం ఆనవాయితీగా మారడంతో జైనధర్మం కాస్త జైనమతంగా మారింది. ఇందులో మొత్తం 24 మంది తీర్థంకరులు ఆవిర్భవించారు. వారిలో 24వ తీర్థంకరుడే మహావీరుడు. అహింసా పరమోధర్మ: అని చాటి చెప్పిన తొలి మతం జైనమతం. బీహార్‌లోని వైశాలి మహావీరుడి జన్మస్థలం. సిద్ధార్థుడు, త్రిశల కుమారుడైన మహావీరుడు చిన్ననాటి నుంచే ఆధ్యాత్మిక భావనలు కల్గివుండేవాడు. 28ఏళ్ల వయసు వచ్చేవరకు కుటుంబంతో గడిపిన మహావీరుడు, తల్లిదండ్రులు మరణించిన తర్వాత సన్యాసం స్వీకరించి సర్వ సంగ పరిత్యాగిగా మారాడు.

జయినుడు అనగా జయించేవాడని అర్థం. తనలోని అంతః శత్రువులను వీరోచితంగా జయించాడు గనుకే ఆయన మహావీర జైనుడయ్యాడు. తల్లిగర్భంలో వుండగానే తన కదలికల వల్ల తల్లికి నష్టం కల్గుతుందేమోనని భావించి స్థిరంగా వున్న అహింసామూర్తిగా మహావీరుడిని చెబుతారు. చిన్ననాటి నుంచే మందస్మితుడై, మౌన గంభీరంగా వుంటూ ఇతర పిల్లలకు భిన్నంగా ప్రవర్తించేవాడు. చైత్రశుక్ల త్రయోదశినాడు జన్మించిన మహావీరుడు సహజ బ్రహ్మజ్ఞాని కావడం వల్ల గురువుల నుంచి ప్రత్యేక బోధనలు లేకుండానే సకల శాస్త్ర పారంగతుడుడయ్యాడు. రాజకుటుంబంలో పుట్టినందువల్ల సంక్రమించే రాజమర్యాదలను తొలినాళ్లలో అనుభవించినా పెద్దల అనుమతితో హేమంత రుతువు బహుళ దశమినాడు సర్వం త్యాగం చేసి ఆధ్మాత్మిక ప్రపంచంలోకి అడుగుపెట్టాడు. వర్ధమాన మహావీరుడు జైనమతం బోధించిన అహింస, సత్యం పలకడం, దొంగతనం చేయకుండా వుండడం, బ్రహ్మచర్యాన్ని పాటించడం, ఆస్తులు సంపాదించకుండడంలాంటి పంచసూత్రాలను పాటించి బోధించడమే గాక కచ్చితమైన జ్ఞానం, కచ్చితమైన విశ్వాసం, కచ్చితమైన నడవడిక అనే త్రిరత్నాలను ప్రబోధించాడు.



షుగర్ వ్యాధిగ్రస్తులకు
సంజీవని జెరిటిన్-డి

వర్ధమాన మహావీరుడు బుద్ధ భగవానుడి సమకాలికుడనే ప్రచారం వుంది. బుద్ధుని మహాపరిత్యాగం, బుద్ధుని తపస్సు, మానవాళిపట్ల బుద్ధుని ప్రేమను గుర్తుకు తెచ్చాడు మహావీరుడు. సంతోషానికి సంబంధించిన శుభ సందేశాన్ని ప్రబోధించాడు. తన సిద్ధాంతాల కోసం దేశమంతా విస్తృతంగా పర్యటించాడు. కొందరు అతన్ని పరిహసించినా, అవమానించేందుకు ప్రయత్నించినా మౌనమే సమాధానంగా ప్రవర్తించాడు మహావీరుడు. అతనిలోని ఆ శాంత స్వరూపమే మహాపురుషుడిగా, విజేతగా అవతరించేందుకు కారణమయ్యింది. తన ఆధ్యాత్మిక యాత్రలో జైన మహావీరుడు కొన్ని వేల మందిని అహింసా మార్గంలోకి మళ్లించగలిగాడు. ఆనాటి సమాజంలో వేళ్లూనికొని వున్న దాసదాసీ వ్యవస్థను కూకటివేళ్లతో పెకిలించడంలో కీలకపాత్ర పోషించగలిగాడు. ఆయన ధర్మబోధ విశిష్టంగా, విలక్షణంగా వుండేది. సమానత్వానికి అధిక ప్రాధాన్యతమిచ్చేవాడు. అన్ని ప్రాణులలో ఏకత్వాన్ని దర్శించమని, సంతోషంగా వుంటూ ఇతరులకు ఆనందాన్ని పంచుదామనేవి మహావీరుని బోధనలు. అహింసాతత్వాన్ని చాటి చెప్పిన మహావీరుడు 72వ ఏట కాలధర్మం చెందాడు.

పోరుబాట

• మళ్లీ తెరపైకి


నేలటూరు యాష్‌పాండ్ భూముల వివాదం!

ముత్తుకూరు మండలం నేలటూరు సమీపంలో బూడిద నిల్వ కోసం సేకరించిన భూముల వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. దాదాపు ఆరు సంవత్సరాల క్రితం బూడిదను నిల్వ చేసేందుకు ఎపి జెన్‌కో రైతుల నుంచి భూములు తీసుకొంది. భూములు అప్పగించే సమయంలో గ్రామాలకు సమీపంలో బూడిదను నిల్వ చేయరాదని రైతులు, గ్రామాల ప్రజలు అధికారులకు స్పష్టం చేశారు. గతంలో అలాగేనన్న అధికారులు బూడిద ప్లాంటు నిర్మాణం కోసం ఇటీవల శంకుస్థాపన చేశారు. రైతులు, ప్రజలు సూచించిన ప్రదేశంలో కాకుండా గ్రామానికి సమీపంలో బూడిద ప్లాంటు నిర్మాణం చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగారు. దీంతో ఉద్రిక్తంగా మారి పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. మొదటి నుంచి కూడా ఈ ప్రాంతంలో ఏర్పాటు కానున్న విద్యుత్ పవర్‌ప్లాంట్లపై వ్యతిరేకత వ్యక్తమవుతూనే వుంది.

ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండలాల పరిధిలో పవర్ ప్లాంట్లు, బూడిద ప్లాంట్ల కోసం వేలాది ఎకరాల మాగాణి భూములు ప్రభుత్వం రెవెన్యూశాఖ ద్వారా సేకరించడం జరిగింది. పవర్‌ప్లాంట్లు ఏర్పాటు చేస్తే వాటి నుంచి వెలువడే కాలుష్యం కారణంగా ప్రజలు అనారోగ్యం పాలవుతారని ప్రజాసంఘాలు వాపోతూనే వున్నాయి. స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, గ్రామాల అభివృద్ధికి సహకరిస్తామని కోటి ఆశలు కల్పించి భూములు తీసుకున్నారని ప్రజలు చెబుతున్నారు. అప్పట్లో ప్రజా ప్రతినిధులు, స్థానిక రాజకీయ నేతల్లో కొందరు కంపెనీ ప్రతినిధులకు మద్దతుగా నిలచి పవర్‌ప్లాంటు ఏర్పాటుకు రైతుల్ని ఒప్పించారన్న ఆరోపణలు వున్నాయి. భవిష్యత్‌లో వీటి కాలుష్యం కారణంగా జరగబోయే ప్రమాదాలను పసిగట్టలేకపోయారు. గత పది రోజుల నుంచి ఎపి జెన్‌కోకు వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు జరుగుతున్నాయి. పవర్‌ప్లాంటు నిర్మాణం పూర్తయ్యే దశకు చేరడంతో బూడిదప్లాంటు నిర్మాణానికి అధికారులు శ్రీకారం చుట్టారు.

ముత్తుకూరు మండలంలోని నేలటూరు, కృష్ణపట్నం, తోటపల్లిగూడూరు మండలాలలో చంద్రశేఖర్‌పురం, పైనాపురం, వరకవిపూడి తదితర గ్రామాల పరిధిలో భూములు తీసుకున్నారు. ప్రభుత్వం సేకరించిన భూములకు సంబంధించి పరిహారాన్ని కూడా అందించారు. కాని తోటపల్లి గూడూరు మండలంలో కొన్ని భూములకు పంపిణీ చేసినా నష్టపరిహారం ప్రక్కదారి పట్టిన సంగతి తెలిసిందే. అసలు లబ్దిదారులకు పరిహారం అందకపోవడం, మరోప్రక్క బూడిదను నిల్వ చేసే ప్లాంట్లను గ్రామాల మధ్య ఏర్పాటు చేయనుండడంతో ప్రజలు అధికారుల తీరుపట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లక్షల్లో పరిహారం, ఉపాధి అవకాశాల పేరుతో తమను మోసం చేశారని ఇప్పుడు బాధపడుతున్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యే సైతం పరిశ్రమల ఏర్పాటుకు భూములు ఇప్పించేందుకు సహకరించారని, భవిష్యత్తులో ఏర్పడే దుష్పరిణామాలకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారమై తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్‌ను కలసి విన్నవించారు.

బూడిద నిల్వ కోసం గతంలో నిర్ణయించిన ప్రాంతాలలోనే నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. పోలీసు బలగాలను రప్పించి



యాష్‌పాండ్‌లను ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ఏర్పాటు చేయవద్దని చెబుతున్న టిడిపి శాసనసభ్యుడు పయ్యావుల కేశవ్.

ఆందోళన చేస్తున్న ప్రజలపై బలప్రయోగం చేసి పనులు పూర్తి చేయాలనుకోవడం అవివేకమన్న సంగతి అధికారులు గుర్తించాలి. ఆందోళన ప్రారంభమైనప్పటి నుండి పోలీసులు ఎపి జెన్‌కో వద్ద బందోబస్తు నిర్వహిస్తున్నారు. బూడిద ప్లాంటు నిర్మాణాలను నిలిపివేసేంతవరకు ఆందోళన చేపట్టాలని వివిధ గ్రామాల ప్రజలు నిర్ణయించినట్లు తెలుస్తుంది. మరోసారి తీరప్రాంతంలో బూడిద ప్లాంట్ల ఏర్పాటుపై ప్రజాగ్రహం ఉధృతమయ్యే అవకాశం వుంది.

● కలకలం సృష్టిస్తున్న

హీరో నాగార్జున భూముల వివాదం!



దేశంలోని సినీ నటులందరిలో అక్కినేని నాగార్జున అత్యంత సంపన్నుడని చెప్తారు. హైదరాబాద్, బెంగుళూరు నగరాలలో ఆయనకున్న భూములు, భవనాల విలువ కొన్ని వేల కోట్ల రూపాయలలో వుంటుందని పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తులు భూముల మీద పెట్టుబడి పెట్టడం అనే సాంప్రదాయం మొదట రేలంగితో, ఆ తర్వాత శోభన్ బాబుతో మొదలైంది. పాపం రేలంగి మద్రాసు నగరంలో విస్తారమైన భూములు సంపాదించినా, వాటి నిర్వహణ చేతకాక, ఆక్రమణల పాలై, చివరి దశలో పేదరికంతో గడిపాడు. కానీ శోభన్‌బాబు మాత్రం ఎంతో జాగ్రత్తతో తన ఆస్తులను వృద్ధి చేసుకొని అందరికీ ఆదర్శంగా నిలిచాడు. ఆ మూసలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసాగించిన మరొక ప్రముఖుడు మురళీమోహన్. ఆ తర్వాత తరంలో అక్కినేని నాగార్జున అందరినీ మించిపోయాడు. తన ఆస్తుల వృద్ధి కోసం రాజకీయాన్ని వాడుకోవడం నాగార్జున నేర్పరితనం. చంద్రబాబు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ఆయనతో మంచిగా వుండి, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు పక్కనే అత్యంత ఖరీదైన స్థలం కొట్టేశాడు. బ్లూ క్రాస్ పేరుతో సంపాదించిన ఆ స్థలం విలువ ఎన్ని కోట్లో చెప్పలేము. ఆ సమయంలో చిరంజీవి కూడా చంద్రబాబును కాకాపట్టి, బ్లడ్ బ్యాంక్ పేరుతో స్థలం కొట్టేశాడు.

వైఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నాగార్జున ఆయనకు బాగా దగ్గరైనాడు. వైఎస్ సంగతి తెలిసిందే కదా, తనను ఆశ్రయించిన వారి కోసం ప్రభుత్వ, ప్రజల సొత్తును గాలికి పోయే పేలపిండి రామార్పణం అన్నంత సులువుగా కట్టబెట్టడం ఆయన రాజకీయ శైలి. ఆ బలహీనతను బాగా వాడుకొన్నాడు నాగార్జున. మర్రి చెన్నారెడ్డి హయాంలో కేటాయింపు జరిగిన అన్నపూర్ణ స్టూడియోస్ భూమిని వ్యాపార ప్రయోజనాలకు వాడుకోవచ్చుననే మినహాయింపు వైఎస్ ద్వారా సంపాదించాడు నాగార్జున. దానితో స్టూడియో విలువ వెయ్యి రెట్లు పెరిగిపోయింది.

మాదాపూర్‌లోని గురుకుల్ ట్రస్ట్ భూములది పెద్ద వివాదం. వాటిలో ఐదెకరాలు సంపాదించి, ఒక ఫాం హౌస్ కట్టుకొని వుండినాడు నాగార్జున. వైఎస్ అధికారంలోకి రాగానే ఆ భూమిని చట్టబద్ధం చేయించుకొని ఎన్ కన్‌వెన్షన్ అనే పెళ్లి మండపం నిర్మించాడు. దానికి ఆనుకొని ఒక చెరువు వుంది. మెల్లమెల్లగా ఆ చెరువులో పాతిక భాగాన్ని ఆక్రమించాడు.

నాగార్జునకు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, గచ్చిబౌలి వంటి విలాస ప్రదేశాలలో విస్తారంగా ఆస్తులున్నాయి. వాటన్నిటినీ అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టం నుంచి మినహాయింప చేసుకొన్నాడు.

అయితే ఆయన ఇటీవల చర్లపల్లి జైలుకు వెళ్లి వైఎస్ జగన్‌ను కలిసి రావడంతో ఆయన భూములు రాజకీయ వివాదంగా మారిపోయాయి. ఆయన పూర్తిగా జగన్ పక్షం చేరిపోవడం తెలుగుదేశం వాదులకు నచ్చలేదు. ఈ మధ్యలో పిసిసి అధ్యక్షుడు బొత్స సత్తిబాబు తమ్ముడికి, నాగార్జునకు ఒక భూమి విషయంలో వివాదం తలెత్తింది. సత్తిబాబు స్వయంగా జోక్యం చేసుకొని నచ్చ చెప్పడానికి ప్రయత్నం చేసినా నాగార్జున విన్పించుకోకపోవడంతోపాటు, మరింత కఠినంగా వ్యవహరించాడట. తన రక్షణ కోసం వైఎస్‌జగన్ మనుషులను ఆ భూమి వద్ద కాపలా పెట్టాడట. దీనితో ఆయన మీద రాజకీయ క్రోధాలు పెరిగిపోయాయి. టీవీ-9, జీ-24 గంటలు ఛానళ్లు నాగార్జున భూ ఆక్రమణలు, చెరువు స్థలం కబ్జా మీద విస్తృత వార్తా కథనాలు ప్రసారం చేశాయి.

తెలుగుదేశం యువ నేత రేవంత్‌రెడ్డి ఏకంగా నాగార్జున భూ వివాదాలపై సిబిఐ దర్యాప్తు జరపాలని ప్రకటన చేశాడు. మరొకప్రక్క తెలుగుదేశం కార్యకర్తలు ఎన్ కన్‌వెన్షన్ వద్ద ఆందోళనకు దిగారు. అందులోని ఆక్రమణ భాగాన్ని స్వాధీనం చేసుకొని, పేదలకు పంచాలని గొడవ చేస్తున్నారు.

కొరవ 14వ పేజీలో







మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పా

గ్రహాల ప్రతికూలతల వల్ల తలపెట్టిన పనులకు బాగా ఇబ్బందులుంటాయి. సమస్యలు అధికమౌతాయి. ఉద్యోగులకు బదలీలు, అవమానాలు తప్పవు. మనోవ్యధలుంటాయి. వృత్తి, వ్యాపారాలలోని వారికి ఆర్థిక ఇబ్బందులు. ఇంట్లో తలపెట్టిన శుభకార్యాలకు రుణాలు లభిస్తాయి. బంధుమిత్రుల సహాయసహకారాలుంటాయి. విద్యార్థుల చదువు చురుగ్గా సాగుతుంది.



వృషభం
కృత్తిక 2,3,4 పా. రోహిణి, మృగశిర 1,2 పా

వృత్తి, వ్యాపారాలు అంతగా అనుకూలించవు. ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి. కుటుంబంలో మనస్పర్ధలు. ఏమి మాట్లాడినా విరోధమే. ప్రభుత్వ సంబంధిత చిక్కులు, వ్యవహారాలందు నష్ట, శారీరక శ్రమ, అకాల భోజనాలుంటాయి. విద్యార్థులకు చదువుకు ఆటంకాలేర్పడగలవు. వ్యవసాయదారులకు శ్రమ అధికంగా వున్నా ఆదాయం వుంటుంది. రాజకీయులకు అననుకూలం. అధిక ధన వ్యయం.



మిథునం
మృగశిర 3,4 పా. ఆర్ద్ర,పునర్వసు,1,2,3 పా

వృత్తి, వ్యాపారాలలో సాధారణ ఆదాయాలుంటాయి. కాని అకారణ ధన వ్యయం వుంటుంది. ఇరుగు పొరుగుతో ఘర్షణలుంటాయి. అన్నింటా ఓర్పు నేర్పు అవసరం. కుటుంబ వ్యవహారాలలో, శుభ కార్యాలలో దూరంగా వుంటూ పట్టుదలతో ప్రయత్నించండి. విద్యార్థులకుఅనుకూలం.వ్యవసాయ, కళా, క్రీడా రంగాలలో చిక్కులున్నా ఆదాయాలుంటాయి.



కర్కాటకం
పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష

అప్రయత్న పూర్వకంగా తలపెట్టిన పనులన్నీ పూర్తవుతాయి. వృత్తి, వ్యాపారాలు పుంజుకుంటాయి. విద్యార్థులు మంచి ఫలితాలు పొందుతారు. వ్యవసాయం క్రమంగా ఆర్థికంగా పుంజుకుంటారు. నూతన కార్య లాభాలుంటాయి. కళ, క్రీడా రంగాల వారు వివాదాస్పద విషయాలలో తలదూర్చకుంటే మేలు. రాజకీయ నాయకులకు శత్రువర్గం నుండి మెప్పులు. ధన రాబడి క్రమంగా పెరుగుతుంది.



సింహం
మఖ, పుబ్బ ఉత్తర 1 పా

తలపెట్టిన పనులలో కొన్ని ఆటంకాలున్నా ప్రయత్నపూర్వకంగా పూర్తవుతాయి. ఆదాయానికి తగ్గట్టు ఖర్చులధికం. వృత్తి, వ్యాపారాలలో క్రమేమీ అనుకూలతలు సాధిస్తారు. వ్యవసాయం, క్రీడలు, కళా రంగాల వారు వృత్తిపరమైన అభివృద్ధిని సాధిస్తారు. వివాహం కాని వారికి క్రమేపీ అనుకూలతలు పెరిగి నిశ్చితార్థ దిశగా కొన సాగగలవు. దూర ప్రయాణాలు అనుకూలించవు.



కన్య
ఉత్తర 2,3,4పా., హస్త, చిత్తా 1, 2 పా

గతంలో వలె వున్నా క్రమేణా మార్పులు వచ్చి వృత్తి, వ్యాపార, ఉద్యోగాలందు సామాన్యతలు సిద్ధిస్తాయి. కుటుంబంలో సహకారం పెరగుట, సంతాన విజయాలతో ఆనందం పొందుట, దైవ కార్యాలలో పాల్గొనుట జరుగుతుంది. అయితే అన్ని రంగాల వారు ఏదో ఒక సమస్యతో బాధపడుట, ఆరోగ్య భంగం, ఆర్థిక సమస్యలుంటాయి. భూ సంబంధ వ్యవహారాలలో నష్టాలుంటాయి.

వారఫలాలు

తేది 27-4-2013 నుండి 03-5-2013 వరకు
మేషంలో రవి, కుజ, శుక్ర, కేతువులు;
వృషభంలో గురువు; తులలో శని, రాహువులు;
28తేది వరకు మీనంలో బుధుడు తదుపరి
మేషంలో; తుల, వృశ్చిక, ధనుర్మకరాలలో
చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

27తేది భరణీ కార్తె.
30తేది శ్రీమత్స జయంతి. శ్రీశ్రీ జయంతి.
1తేది మే డే.
2తేది శుక్రమౌఢ్యమి త్యాగం.

శుభ ముహూర్తాలు

శుక్ర మౌఢ్యమి కారణంగా వివాహాది శుభ కార్యాలకు శుభముహూర్తాలు లేవు. సీమంత, అన్నప్రాసనాది సామాన్య కార్యక్రమాలకు శుభముహూర్తాలున్నాయి.

ఏప్రిల్ తిథులు
చైత్ర బహుళ

27	శని	విదియ	సా	07.22 గం.ల.వ
28	ఆది	తదియ	సా	05.13 గం.ల.వ
29	సోమ	చవితి	ప	01.10 గం.ల.వ
30	మంగళ	పంచమి	ప	10.19 గం.ల.వ

మే తిథులు

1	బుధ	షష్టి	సా	07.46 గం.ల.వ
		సప్తమి	తె	05.36 గం.ల.వ
2	గురు	అష్టమి	రా	02.55 గం.ల.వ
3	శుక్ర	నవమి	రా	02.56 గం.ల.వ

అక్కరాజు బాలసుబ్రహ్మణ్యం
7/34, దొడ్ల సుబ్బారెడ్డి నగర్, నవలాకులతోట, నెల్లూరు – 2. సెల్: 95819 76599.



తుల
చిత్తా 3,4 పా, స్వాతి, విశాఖ 1,2,3 పా

ఈ రాశి వారికి లగ్న, సప్తమ, అష్టమ స్థితిలో గ్రహసంచారంచే తలపెట్టిన పనులలో పట్టుదల అవసరం. అదీ వ్యక్తిగత పర్యవేక్షణలో చేపట్టుట మంచిది. కుటుంబ వ్యక్తుల మధ్య అభిప్రాయ భేదాలు సమస్యాయుతంగా వుంటాయి. వృత్తి, వ్యాపార, ఉద్యోగాల వారికి ఆర్థికాదాయం సామాన్యం. విద్యార్థులు అన్య విషయాలకు దూరంగా వుండుట మేలు. మనశ్శాంతి వుండదు.



వృశ్చికం
విశాఖ 4 పా., అనూరాధ, జేష్ఠ

గ్రహ సంచారం పూర్వం వలె వుండుటచే కుటుంబంలో విభేదాలు, సౌఖ్యం తగ్గుట వుంటుంది. వృత్తి, వ్యాపార, ఉద్యోగులు అధికారుల ఒత్తిడి పెరిగి, ధన దుర్వినియోగాలుంటాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. విద్యార్థులు ఆలోచనతో వ్యవహరించాలి. వ్యవసాయదారులకు ఆశాజనకంగా వుంటుంది. కళ, క్రీడా రంగాల వారికి ఆటంకాలు, అనుకోని నష్టాలుంటాయి.



ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

గ్రహాల ప్రతికూలతలచే ఆలోచనలు కలసి రాకపోవుట, కుటుంబంలో నిరాశలు పెరుగుట, తప్పనిసరి ప్రయాణాలు వుంటాయి. వివాదాలకు దూరంగా వుండండి. విద్యార్థులు పట్టుదలతో ప్రయత్నించాలి. వృత్తి, వ్యాపారాలలో ఆదాయాలు పర్వాలేదనిపిస్తాయి. వ్యవసాయదారులు నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు. కళ, క్రీడా రంగాల వారికి నూతన పరిచయాల వల్ల లాభం.



మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా. శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

గురు, శక్రులు తదుపరి బుధుడి అనుకూలత వల్ల సామాజికమైన గుర్తింపులుండి, చేపట్టిన పనులలో సానుకూలతలు సాధిస్తారు. వృత్తి, వ్యాపార, ఉద్యోగాలలోని వారికి ఖర్చు తగ్గి ఆదాయం వుంటుంది. ఇతరుల వ్యవహారాలలో తలదూర్చకుండా వుంటే మేలు. కొన్ని వ్యవహారాలు స్వీయ పర్యవేక్షణలో వ్యవహరించడం మేలు. విద్యార్థులు తమ విద్యావకాశాలు మెరుగుపరచుకొంటారు.



కుంభం
ధనిష్ఠ 3,4 పా. శతభిషం, పూర్వ భాద్ర 1,2,3 పా

గ్రహస్థితులు సామాన్యంగా సాగి తలపెట్టిన పనులలో శ్రమానంతర ఫలితం వుంటుంది. తరచూ ఆటంకాలు, కాలాతీతం వుండి శరీర ఆరోగ్యభంగాలుంటాయి. ఇంట్లో జరిగే శుభకార్యాలకు మిత్రుల సహకారాలుంటాయి. తల్లితండ్రులను అనుసరించుటచే స్థిరాస్తి విషయాలలో స్తంభన తొలగిపోతుంది. వృత్తి, వ్యాపారాలు సామాన్యం. విద్యార్థులు చదువులందుకాలాతీతాలు ఏర్పడకుండా జాగ్రత్తపడాలి.



మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

మిశ్రమ ఫలితాలుంటాయి. కొన్ని వ్యవహారాలలో ధైర్యసాహసాలు అవసరమౌతాయి. తలపెట్టిన పనులన్నీ ఒంటరి ప్రయత్నంగానే సాధిస్తారు. విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ వహిస్తారు. వ్యవసాయ, కళా, క్రీడా రంగాల వారికి రుణదాతలతో సర్దుబాటు లేదా రుణ ప్రయత్నాలు ఫలిస్తాయి. గృహ లేదా వాస్తు మార్పులకు ప్రాధాన్య మిస్తారు. ఆరోగ్య విషయంలో ఏదో ఒక సమస్య వుంటుంది.

భవిష్యత్ శాస్త్రాలను ముందే చెప్పే జ్యోతిష శాస్త్రం!

డాక్టర్ ముంతాజ్‌బేగం *హైదరాబాద్*

** జ్యోతిష శాస్త్రం గొప్పదనాన్ని గురించి చెప్పండి?*

జ్యోతిషం ప్రత్యేక శాస్త్రం. వాస్తు అందులోని అంతర్భాగం. ఖగోళ శాస్త్రాన్ని స్వీకరించిన శాస్త్రం. 1914 జర్మన్ బ్రిటీష్ యుద్ధాన్ని, మరికొన్ని ముఖ్య విషయాల్ని ముందే చెప్పి ప్రపంచాన్ని అబ్బురపరచిన శాస్త్రం.

టి.కృష్ణకాంత్ *తిరుపతి*

** ఎన్నిచేసినా మా బ్రతుకుల మారడం లేదు.*

నిరాశ వద్దు. మీ దంపతుల పేర్లు పంపండి. యంత్రం సూచిస్తాను. ఓంకార స్వరూపమైన యంత్రానికి అసాధ్యమంటూ ఏదీ వుండదు.

టి.తిరుమంగతాయారు *తిరుపతి*

** పిల్లలు పుట్టిన నక్షత్ర, తిథుల వల్ల పెద్ద వారికి అరిష్టమటకదా?*

శాస్త్రం చెప్పిన పరమ ఛాందసాల్లో ఈ అధ్యాయం ఒకటి. పరాశర సంహిత బాలలపై అభియోగాలను ఖండిస్తున్నది. శాస్త్రంలోని ఛాందసాల్ని నమ్మకపోవడమే మంచిది.

సయ్యద్ సంషాద్‌బేగం *తిరుపతి*

** పిల్లలు చదువులు అంతంత మాత్రంగానే వున్నాయి. సమస్య తీరేదారేదైనా వుందా?*

రత్నధారణ పిల్లలకు, ఇంటికి యంత్ర ప్రతిష్ట మీ సమస్యల్ని పరిష్కరిస్తుంది.

ఎం.ఉమ *కర్నూలు*

** గృహ ప్రవేశములు ఆషాఢ మాసంలో చేయవచ్చునా?*

చేయకూడదని వశిష్ఠ వాస్తు చెబుతున్నది. సిరినాశనం' అని శాస్త్రం అభిప్రాయం.

సి.శాంభవీకృష్ణ *ఒంగోలు*

** గృహ ప్రవేశాలు చేయతగ్గ నక్షత్రాలేవి?*

గృహ ప్రవేశానికి ఉత్తమమైన నక్షత్రాలు రోహిణి, చిత్త, అనూరాధ, ధనిష్ఠ, శతభిష, ఉత్తర త్రయం, రేవతి నక్షత్రాలు.

డాక్టర్ కె.భాస్కర్ *బెంగుళూరు*

** చైనా వాస్తు చదివారా? వారికి మిత్ర రాశులంటే ఏమిటి?*

జాగ్రత్తలు, వ్యక్తిగత భయాల నుంచి పుట్టింది వారి వాస్తు శాస్త్రం. కోతి, ఎద్దు, డ్రాగన్ వారి మిత్ర రాశులు.

పి.సుశర్మ *కావలి*

** రాజవీధికి ఇతర దిక్కుల్లో గృహాలు నిర్మించవచ్చునా? పరిహారం ఏమిటి?*

వీధికి వెన్నుచూపి, ప్రక్కవైపు గృహ నిర్మాణాలు చేయకూడదు. అందువల్ల విదిక్ దోషం వస్తుంది. వెంటనే సంబంధిత యంత్రాన్ని ప్రతిష్టించుకోవాలి.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

టి.వి.ఆర్ *అద్దంకి*

** నక్షత్రం వల్ల అరిష్టాలని పూజారి చెప్పారు. కాలు పెట్టిన వేళావిశేషం కూడా కారణమట?*

శాస్త్రం తెలియక ఒకరు, సంస్కారం లేక మీరు ఆడపిల్ల జీవితంతో ఆడుకుంటున్నారు. వినాశకాలం దాపురించినపుడు విపరీత బుద్ధులు పుడతాయని మహాత్ములు ఊరికే అనలేదు.

టి.వి.సంధ్య *చిత్తూరు*

** సీతాదేవి జన్మదినం గురించి మీకు తెలుసా?*

సీతాదేవి జన్మదినం బహుళ అష్టమి అని శాస్త్ర నిష్ణాతులైన గురుతుల్యులు చెబుతుంటారు.

డాక్టర్ తరుణ్‌నాయక్ *అనంతపురం*

** శ్రీకాళహస్తిలో గాలి గోపురం నిర్మాణం తూర్పువైపు ఎందుకు చేయవలసి వచ్చింది?*

ఆలయంలో కాళహస్తీశ్వరుడు, అమ్మవారు విభిన్నముఖాలు వీక్షిస్తున్నారు. ఆలయ ప్రవేశం ఉత్తరమయింది. అందువల్ల 1513లో రాయలు చంద్రగిరికి రాగా ఆలయ వేదపండితులు ఆయన్ను కలిసి తూర్పు గాలి గోపురం విషయం ప్రస్తావించారు. క్రీశ 1515 కొండవీటి విజయం తర్వాత రాయలు క్రీశ 1516లో గాలి గోపురాన్ని నిర్మించారు.

ఎల్.పెంచలయ్య *సికింద్రాబాద్*

** మేషరాశి వారు ఏ వృక్షం పెంచితే అదృష్టవంతులవుతారు?*

వీరికి 'రక్త చందన' వృక్షం వృక్ష దేవత. ఈ వృక్షాన్ని పెంచితే అదృష్టవంతులవుతారు.

హిజ్రాల మధ్య ఆధిపత్య పోరుతో శాంతి భద్రతల సమస్య!

తమ ఉనికి తెలియకుండా బ్రతికే హిజ్రాలు నేడు నగరంలో బహిరంగంగా అలజడి సృష్టిస్తూ తిరగడంతోపాటు దారి దోపిడీలకు పాల్పడుతున్నారు. వీరి మధ్య ఏర్పడిన రెండు గ్రూపుల ఆధిపత్య పోరు మాటున చేస్తున్న అరాచకాలు శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తున్నాయి.



కలక్టరేట్ వద్ద ప్రత్యర్థి వర్గానికి చెందిన హిజ్రా ఫోటోను చెప్పులతో కొడుతున్న దృశ్యం.

కప్పుడు బ్రతుకుదెరువు కోసం భిక్షాటన చేసే హిజ్రాల మధ్య నేడు ఆధిపత్యపోరు జరుగుతోంది. పట్టణ ప్రాంతాల్లోని హోటళ్లు, వ్యాపార సంస్థల వద్ద హిజ్రాలు భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తుంటారు. వీరి జీవన విధానం భారం కావడంతో కొన్ని స్వచ్ఛంధ సంస్థలు వీరికి ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నాయి. విలాసవంతగా జీవించేందుకు అలవాటుపడిన కొందరు హిజ్రాలు దారి దోపిడీలకు పాల్పడుతున్న సంఘటనలు అనేకం వున్నాయి. రాత్రి సమయంలో అందంగా అలంకరించుకోవడం, ఖరీదైన దుస్తులు ధరించి పురుషులను ఆకర్షిస్తుంటారు. వీరి ఆకర్షణలో పడ్డ యువకులను బెదిరించి నగదు, బంగారు వస్తువులు, సెల్‌ఫోన్లు లాగేసుకొని నిర్జన ప్రదేశాల్లో వదిలేస్తుంటారు. వీరి బారినపడిన వారు జరిగిన విషయాలు బయటకు చెబితే పరువు పోతుందన్న ఉద్దేశంతో తేలుకుట్టిన దొంగల్లా వుండిపోతున్నారు.

ఒంటరిగా మోటారు బైక్‌లపై వెళ్లే వారినే హిజ్రాలు లక్ష్యంగా ఎంచుకొంటారు. తొలుత మినీ బైపాస్ రోడ్డులోని భక్తవత్సలనగర్, అయ్యప్పగుడి వరకు సంచరించేవారు. వీరి ఆగడాలపై పోలీసులకు సమాచారం వెళ్లి, నిఘా వుంచడంతో జాతీయ రహదారిని ఎంచుకున్నారు. వాహన చోదకులను నిలిపి లిఫ్ట్ అడిగి కొద్ది దూరం ప్రయాణించిన తర్వాత బెదిరించి వారి దగ్గర వున్న నగదు, నగలను దోచుకొంటున్నారు. వాహన చోదకులు జరిగిన షాక్ నుంచి తేరుకునేలోగా అక్కడ నుంచి మాయమైపోతుంటారు. ఇటీవల చెన్నై నుంచి హైద్రాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లో కూడా కొందరు హిజ్రాలు భారీ దోపిడికి పాల్పడ్డారు. ఐదు నిమిషాల వ్యవధిలోనే పని ముగించుకొని రైలు చైన్‌లాగి దిగి వెళ్లిపోయారు. ఈ సంఘటనతో అప్రమత్తమైన పోలీసులు హిజ్రాలపై నిఘా వుంచి కొందరిని అదుపులోకి తీసుకొని విచారించారు. హిజ్రాల మధ్య గ్రూపులు వుండడంతో ఒక గ్రూపు చేసిన నేరాన్ని మరో గ్రూపుపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారన్న ఆరోపణలు వున్నాయి.

స్వచ్ఛంద సంస్థల్లో ఆశ్రయం పొందుతున్న హిజ్రాలు తమ పేరుతో మరో వర్గం చేస్తున్న దోపిడీలు, ఇతర నేరాలపై ఆందోళన చేపట్టారు. సమాజంలోని కొన్ని అసాంఘిక శక్తులతో అలేఖ్య అలియాస్ అనిల్‌కుమార్ అనే హిజ్రా చేతులు కలిపి నేరాలకు పాల్పడుతుందని ఆరోపణలు చేశారు. ఇటువంటివారి వల్ల తమ ఉనికికే ముప్పు ఏర్పడే ప్రమాదం వుందని ఆవేదన చెందారు.

నగరంలో వున్న హిజ్రాలు భారీ సంఖ్యలో తరలివచ్చి ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌రేట్ ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. సమాజంలో ఇప్పటికే హిజ్రాలను చులకన భావంతో చూస్తుంటారు. పగటిపూట బయటకు వెళ్లాలంటే భయపడుతుంటారు. సాయంత్రం 6 గంటల తర్వాత బయటకు వచ్చేస్తారు. అందరిలాగే వీరికి సమాజంలో సముచిత స్థానం కల్పించాలన్న సంకల్పంతో స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఆశ్రయం కల్పిస్తున్నాయి.

బయట తిరిగేందుకు అలవాటుపడ్డ వారు ఆశ్రమం నుంచి వచ్చి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది. కొందరు చేస్తున్న నేరాల వల్ల మొత్తం హిజ్రాలకు చెడ్డపేరు వస్తుండడంతో రోడ్డు పైకివచ్చి ఆందోళన చేయాల్సి వచ్చిందంటున్నారు. పోలీసులు నేరాలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రైళ్లు, జాతీయ రహదారిపై హిజ్రాలు చేసే నేరాలను నియంత్రించేందుకు పోలీసులు కృషి చేయాల్సిన అవసరం వుంది.

బిజీ బిజీ

● ప్రభుత్వ పథకాల ప్రకటన, అమలు, సమీక్షలతో...

జిల్లా యంత్రాంగం యమ బిజీ!

"రెవిన్యూ సదస్సులు, ఇందిరమ్మ బాట, అమ్మ హస్తం, ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికల అమలులో జిల్లా యంత్రాంగం యమబిజీగా ఉంది. ఈ బిజీ నుంచి వారికి ఉపశమనం లభిస్తేగానీ ప్రజలకు అధికారులు అందుబాటులోకి రారు."


రాష్ట్ర ముఖ్యమంత్రి కొత్తగా ప్రకటించే పథకాలు, వాటి అమలు, సమీక్షలతో జిల్లా అధికార యంత్రాంగం నిత్యం బిజీగా వుంది. ఈ గత నెలలో ప్రారంభించిన రెవిన్యూ సదస్సులు ఈ నెల 10వ తేదీతో ముగిశాయి. దాదాపు నెల రోజులపాటు ఈ సదస్సులు జిల్లాలో జరిగాయి. రెవిన్యూ శాఖతోపాటు పంచాయితీరాజ్, ఇందిర క్రాంతిపథం, దేవాదాయ శాఖ, పలు శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది వీటి నిర్వహణలో పాల్గొన్నారు. ఇవి జరుగుతుండగానే ఈ నెల మొదటి వారంలో ఇందిరమ్మ బాట కార్యక్రమానికి ముఖ్యమంత్రి జిల్లాకు వచ్చారు. దాదాపు వారం రోజులపాటు సిఎం పర్యటించే ప్రాంతాల్లో ఏర్పాట్లు చూసేందుకు అధికారులు అహర్నిశలు కృషి చేయడం జరిగింది. ఇందిరమ్మ బాట కార్యక్రమాల్లో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన సిఎం ఉగాది నుంచి 9 రకాల సరుకులను రేషన్ షాపుల ద్వారా లబ్దిదారులకు పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. 'అమ్మ హస్తం' పేరుతో అందించే సరుకులను రూ.185లకే అందించనున్నారు. దీనికి అవసరమైన ఏర్పాట్లను పౌరసరఫరాల శాఖ చేయాల్సి వుంటుంది. ఉగాది నాటికి సరుకులు జిల్లాకు చేరకపోవడంతో అధికారులకు ఏం చేయాలో దిక్కుతోచలేదు. ఈ నెల 14తేది ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికపై సమీక్షించేందుకు సిఎం జిల్లాకొచ్చారు. దీంతో జిల్లా ఉన్నతాధికారులు సమీక్షకు అవసరమైన నివేదికలను తయారు చేసుకోవడంలో నిమగ్నం కావాల్సి వచ్చింది.

మొన్నటి వరకు రెవిన్యూ సదస్సులు, ఆ తర్వాత ఇందిరమ్మ బాట, అమ్మ హస్తం అమలు, ఎస్సీ ఎస్టీ ఉప ప్రణాళికపై సమీక్షల్లో పాల్గొనాల్సి రావడంతో అధికారులు ఊపిరి పీల్చుకోలేక పోతున్నారు. జిల్లాలో విద్యుత్ కోతలు, సర్‌ఛార్జీల భారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ కోతల కారణంగా కొన్ని మండలాల్లో వరి పంటకు నీరు సక్రమంగా సరఫరా కాని పరిస్థితి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కనీస దృష్టి సారించలేని పరిస్థితుల్లో అధికార యంత్రాంగం వుంది. ఈ నెలలో రెండు దఫాలు సిఎం జిల్లా పర్యటనకు రావడంతో అధికారులు కార్యాలయాల్లో కూడా అందుబాటులో లేకుండా పోయారు. జిల్లాలో వేసవికాలంలో త్రాగునీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నా నివారించేందుకు గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు ఎటువంటి ప్రయత్నాలు చేయడం లేదు.

ఇందిరమ్మ పేరుతో వివిధ సంక్షేమ పథకాలను ప్రకటించిన ప్రభుత్వం వాటి అమలు తీరుపై సమీక్షించేందుకు ఇందిరమ్మ బాట కార్యక్రమం జరుపుతోంది. ఈ పథకాల అమల్లో లోపాలు బయటపడకుండా అధికారులు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ముందుగా కొందరు లబ్దిదారులను ఎంపిక చేసి సిఎం అడిగే ప్రశ్నలకు ఎట్లా సమాధానం చెప్పాలో శిక్షణ ఇస్తున్నట్లు సమాచారం. సిఎం కూడా బ్యాంకు లింకేజి రుణాలు కోట్లలో అందిస్తున్నామని చెప్తున్నారే తప్ప, రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకు అధికారులు ఎలా స్పందిస్తున్నారన్న విషయాన్ని ఏ ప్రాంతంలోనూ అడిగిన దాఖలాలు లేవు. విద్యుత్ ఛార్జీలపై గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీ, ఎస్టీలకు 50 యూనిట్లు లోపు బిల్లులను ప్రభుత్వం భరిస్తుందని ప్రకటించారు. 50 యూనిట్లకు కనీస రూ.45లు, దీనిని కూడా ఉప ప్రణాళిక నిధుల నుంచి చెల్లిస్తారే తప్ప ప్రభుత్వం అదనంగా భరించే పరిస్థితి వుండదు.

సిఎం చేస్తున్న ప్రకటనలపై ప్రతిపక్ష పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. విద్యుత్ ఛార్జీలు తగ్గించమంటే ఎస్టీ, ఎస్సీలకు ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పడం, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని ఆందోళన చేస్తే రూ.185లకే 9 రకాల సరుకులు సరఫరా చేస్తామని ప్రకటించడంపై మండిపడుతున్నాయి. మొత్తం మీద సంక్షేమ పథకాలను ప్రకటించడం, వాటి అమలు తీరుపై సమీక్షించడం వరకే ప్రభుత్వం, అధికారులు పరిమితం కావడం విశేషం.

గుండె 'జారి' గల్లంతవ్వలేదు!



✍ అల్లూరు రహీం

చలన చిత్ర పరిశ్రమలో కొన్ని సినిమాలు మినహాయించి మిగతావన్నీ ప్రేమకథలతోనే తయారవుతాయి. కారణం ప్రేమ విశ్వజనీయమైనది. ప్రేమకు స్పందించని హృదయం, ప్రేమకు లోబడని మనిషి ప్రపంచంలో అరుదని చెప్పొచ్చు. హీరో నితిన్ 'ఇష్క్' చిత్రంతో ప్రేమ కథల బాట పట్టాడు. ఇష్క్ బాగా ఆడడంతో ఆ బాటలోనే గుండెజారి గల్లంతయ్యిందే అంటూ మళ్లీ నిత్యమీనన్‌తో జత కట్టాడు. శ్రేష్ఠ్ మూవీస్ పతాకంపై తయారైన ఈ ముక్కోణపు ప్రేమకథ ప్రేక్షకుల మనసులను కట్టిపడ వేయలేక పోయింది. కారణం కథ గొప్పగా లేకపోవడం. తెరపై జరగబోయే సన్నివేశాలన్నీ ప్రేక్షకులకు ముందుగానే తెలిసి పోతుండడంతో తుళ్లింత లేకుండా పోయింది. స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు, కామెడీ సన్నివేశాలు బొటాబొటిగా కుదరడం ఈ సినిమాను బలహీనపర్చాయి. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్ నటించిన తొలిప్రేమ చిత్రంలో హిట్‌సాంగ్ 'ఏ మయ్యిందో ఈ వేళ' రీమేక్ చేసి పెట్టారు. ఈ పాటలో ఒక చోట పవన్‌కళ్యాణ్ గ్రాఫిక్స్ సహకారంతో నితిన్‌తో కలసి డ్యాన్స్ చేసేలా చూపిస్తారు. కానీ ఈ పాట కర్ణప్రేయంగా లేదు. బ్యాడ్మింటన్ క్రీడాకారిణి గుత్తా జ్వాలను ఐటమ్ గాళ్‌ను చేస్తూ లేడీస్ అండ్ జంటిల్ మేన్ చరణంతో సాగే పాటను పెట్టారు. కానీ గుత్తా జ్వాల ఈ పాటలో నర్తించను, హావభావాలు పలికించను గందరగోళ పడిన విషయం తెరపై కనపడి పోతుంది. హిట్ పెయిర్ నితిన్, నిత్యమీనన్‌పై చిత్రీకరించిన గుండె జారి గల్లంతయ్యిందే పాట ప్రేక్షకులను అలరిస్తుంది. ఇషా తల్వార్, నితిన్‌లపై చిత్రీకరించిన 'నీవే నీవే' చరణంతో సాగే పాటలో బలం లేకపోయినా కెమెరామెన్ ఆండ్రూ అందమైన లొకేషన్లలో చిత్రీకరించిన తీరు మంత్ర ముగ్దులను చేస్తుంది. కామెడీ కోసం ఓ కొజ్జాతో రెండు సార్లు చిత్రీకరించిన సరసం అసహ్యంగా వుంది. హీరోయిన్ మనసు దోచను హీరో ఎగురవేసే బెలూన్ల సన్నివేశం బాగుంది. ఖుషీ సినిమాలోని భూమిక బొడ్డు చూపించే సన్నివేశం తరహాలో నిత్యమీనన్‌ను దర్శకుడు వాడుకోవాలని చూసినా ఆమె ఒప్పుకోక పోవడంతో రెండు మూడు సార్లు ఖుషీ చిత్రంలోని సన్నివేశాన్ని ఈ చిత్రంలో చూపి సరిపెట్టాడు. హర్షవర్ధన్ వ్రాసిన మాటలతోనే చిత్రం 148 నిమిషాలు నడుస్తుంది. చిత్రంలో ప్రేమను బహురకాలుగా వర్ణించాడాయన. అమ్మాయిలు లవ్‌ను కట్ చేయరు... లవర్‌ని కట్ చేస్తారు. లవ్ స్నూకర్ బాల్ వంటిది. లవ్ గురు కాదు లస్ట్ గురు డైలాగులు ఆలోచింపజేస్తాయి. చాలా చోట్ల ఆయన వ్రాసిన బూతు మాటలకు సెన్సార్ కత్తెర వేసింది. కథకుడు, దర్శకుడు కూడా అయిన విజయకుమార్ కొండా ఇంకాస్త శ్రమించి ఉంటే ఈ చిత్రం ఫలితం మరోలా ఉండేదనవచ్చు.

చిత్ర సమీక్ష

చిత్రకథలోనికి వెళ్తే నితిన్(కార్తీక్) హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తుంటాడు. మిత్రుడు పండు(అలీ) పెళ్లిలో శ్రుతి(ఇషా తల్వార్)ను చూసి మనసు పారేసుకొంటాడు. ఆమె తాలుకు వివరాలను పండును అడగ్గా అతను పబ్‌లో తాగిన మైకంలో ఉండి ఓ రాంగ్ ఫోన్ నెంబర్ ఇచ్చేస్తాడు. కార్తీక్ పండు ఇచ్చిన నెంబర్‌కు రింగ్ చేయగా అది బాగా డబ్బున్నా విశిష్ట వ్యక్తిత్వం ఉండే అమ్మాయి శ్రావణి(నిత్యమీనన్)కు వెళ్తుంది. శ్రావణీ ఫాంటసీ ప్రియుడు కావాలని ముందు నుంచి ఆలోచిస్తూ కార్తీక్ మాటలకు పడిపోతుంది. శ్రావణిని కార్తీక్ శ్రుతిగానే భావిస్తాడు. వాస్తవానికి శ్రుతి అతను పనిచేసే సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రక్కనే బొటిక్స్ నిర్వహిస్తూ ఉంటుంది. ఆమెను కార్తీక్ స్నేహితుడు మధు(మధునందా) లైన్‌లో పెట్టను అతనే తగిన సలహాలిస్తాడు. ముక్కోణంలో సాగే ఈ ప్రేమకథకు విశ్రాంతికి ముందు బ్రేకులు పడతాయి. తాను ఫోను చేస్తున్నది శ్రుతికి కాదు శ్రావణికి అని కార్తీక్ తెలుసుకొంటాడు. శ్రావణికి సారీ చెప్పమని పండును పంపి, శ్రుతిని లైన్‌లో పెట్టాలనుకొంటాడు. కానీ ఆమె 'ఛీ' కొడుతుంది. మళ్లీ సిగ్గ లేకుండా శ్రావణికి ఫోన్ చేస్తాడు. అతని తీరుకు మనసు గాయపడ్డ శ్రావణి తండ్రి సహకారంతో కార్తీక్ పనిచేసే ఆఫీసుకు బాస్‌గా వచ్చి బుద్ధి చెప్పాలని ఒక పథకం రచిస్తుంది. కానీ చివరకు తాను చూడని శ్రావణి వైపే కార్తీక్ ప్రేమ మొగ్గ చూపుతుంది. ఈ పరిణామానికి పగతీర్చుకొందామని వచ్చిన శ్రావణి మనసు కరిగి అతడ్ని హత్తు కోవడంతో సినిమా ముగుస్తుంది. నితిన్, నిత్యమీనన్ ఈ చిత్రంలో తమ పాత్రలు బేషుగ్గా పోషించారు. అయినా ఈ చిత్రం చూసే ప్రేక్షకుల గుండెజారి గల్లంతయ్యేలా చేయలేక పోయారు.

సంతోషం రెట్టింపయ్యింది!



బాలీవుడ్ భామ నేహా ధూపియాకు సినిమాల్లో ఇంకా డిమాండ్ తగ్గ లేదు. ఈ విషయమై ఆమె మాట్లాడుతూ హిందీ చిత్రాల్లో నటించడం ద్వారా దేశ విదేశాల్లో లెక్కలేనంత గుర్తింపు సంపాదించాను. దక్షిణాదిలో నటించాక కొంచెం డబ్బు కూడా వచ్చింది. మాతృభాష పంజాబీలో నటించాక మాత్రం నాలో సంతోషం రెట్టింపయ్యిందంది. నేహాధూపియా తెలుగు ప్రేక్షకులకు పరిచయమే. పలు చిత్రాల్లో ప్రత్యేక గీతాలు చేసింది. ప్రస్తుతం కరణ్‌జోహార్ నిర్మాణంలో తెరకెక్కుతున్న ఓ హిందీ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఏ భాషల్లో నటించడం ఇష్టమంటే మరాఠి, కన్నడ, బెంగాళి, పంజాబీ చిత్రాలంటే ఆసక్తి చూపుతానంటుంది.

ప్రేమించే తీరిక లేదు!



బ్యాండ్ బాజా బారాత్ సినిమా హీరోయిన్ అనుష్క శర్మను బాలీవుడ్‌లో టాప్ ఛేర్‌లో కూర్చొబెట్టింది. ఇప్పుడు రాజ్‌కుమార్ హిరానీ, అనురాగ్ కశ్యప్ వంటి అగ్ర దర్శకుల సినిమాల్లో నటిస్తోంది. ఈ జీరోసైజ్ సుందరి ప్రేమలో పడిందని ఆ మధ్య పుకార్లు వచ్చాయి. రణవీర్ కపూర్, రణబీర్ కపూర్‌లతో ముడిపెడుతూ వార్తలొచ్చాయి. ఈ విషయాన్ని అనుష్క శర్మ దగ్గర ప్రస్తావిస్తే ప్రేమించే తీరిక ఉంటే తప్పకుండా ప్రేమలో పడే దాన్ని, కానీ ఆ అవకాశం నాకు లేదు. జీవితం ఉరుకులు, పరుగుల మధ్య సాగుతోంది. ఇక ప్రేమ గూర్చి ఆలోచించే తీరిక ఎక్కడని ప్రశ్నించింది.

నేహా శర్మ భజన!



చిరుత సినిమాలో హీరోయిన్ నేహాశర్మ తెలుగులో ఒకట్రెండు సినిమాలు చేసేసి బాలీవుడ్ వెళ్లిపోయింది. అక్కడే సెటిల్ అయ్యే ప్రయత్నం చేస్తోంది. ఈ ముద్దుగుమ్మ చూపు ఇప్పుడు బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్‌ఖాన్‌పై పడింది. అవకాశం దొరికితే చాలు... సల్మాన్ గ్రేట్ అంటూ తెగ పొగిడేస్తోంది. ఆయన ప్రక్కన నటించాలని ఉందా? అని అడిగితే... ప్రస్తుతానికి అంత ఆశ లేదు కానీ... అవకాశం వస్తే మాత్రం ఎట్టి పరిస్థితుల్లో వదలుకోను అంటూ తెలివిగా తన మనసులోని మాటను బయటపెడుతోంది. సల్మాన్‌పై మీకు ఎప్పట్నుంచి ఇష్టం పెరిగింది? అని అడిగితే మొదట్నుంచీ ఆయనకు వీరాభిమానిని నేను. సల్మా చిత్రం వచ్చిందంటే మొదటి ఆట చూసేయాల్సిందే. చిత్రసీమలో ఆయనకు ఎదురులేదని తెగ భజన చేస్తుంది.



తమన్నా పీఛేముడ్!

కోటి ఆశలతో బాలీవుడ్‌కు వెళ్లిన తమన్నా... మళ్లీ తెలుగు, తమిళ భాషలవైపే చూస్తోంది. ఆమె ఇటీవల నటించిన 'హిమ్మత్‌వాలా' బాక్సాఫీసు దగ్గర సందడి చేయలేదు. విడుదలకు ముందు తమన్నాకు బోలెడంత ప్రచారం లభించింది. జూనియర్ శ్రీదేవి అన్నారు. అయితే ప్రేక్షకులు మాత్రం మార్కులు వేయలేదు. దాంతో తనకు విజయాలను ఇచ్చిన ప్రాంతీయ భాషల్లో దూసుకవెళ్లడమే నయమని భావిస్తోంది. అందులో భాగంగానే వరుసగా తెలుగు, తమిళ భాషల్లో నటించాలని భావిస్తోంది. ఇప్పటివరకు చేయాల వద్దా అనుకొంటున్నన్న కెవి ఆనంద్ దర్శకత్వంలో తయారవుతున్న తమిళ చిత్రంలో ఆర్య, తెలుగులో బెల్లంకొండ శ్రీనివాస్‌ల సరసన నటించను ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

మళ్లీ ట్విట్టర్‌లో మహేష్‌బాబు!

హీరో మహేష్‌బాబు ట్విట్టర్ డబ్బా మరోసారి కూత పెట్టడానికి సిద్ధమవుతోంది. మహేష్ బాబుకు ట్విట్టర్‌లో ఖాతా వుంది. అయితే అందులో అభిమానుల్ని ఆయన పలకరించి చాలాకాలం అయ్యింది. వరుస చిత్రాలతో బిజీ వల్ల అభిమానులను పలకరించని ఆయన ఇక ముందు అభిమానులకు టచ్‌లో ఉంటానన్నారు. సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాను ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ప్రస్తుతం సుకుమార్ సినిమా కోసం కష్టపడుతున్నా. దేహదారుఢ్యం పెంచుకోను మూడు నెలలుగా ప్రత్యేక కసరత్తు చేస్తున్నా. బాద్‌షా చూశా. చాలా బాగుంది. వినోదాత్మక చిత్రాలను తీర్చిదిద్దడంలో తనకుతానే సాటి అనే విషయాన్ని శ్రీనువైట్ల మరోసారి నిరూపించుకొన్నాడు అని 'బాద్‌షా' యూనిట్‌ని మహేష్ అభినందించారు.

● సెలవులు ఇవ్వకముందే

క్లాసులు ప్రారంభం!

[పట్టించుకోని విద్యాశాఖ అధికారులు]

ప్రైవేట్ విద్యాసంస్థలు, కార్పొరేట్ పాఠశాలలు అడుగడుగునా ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్నా, ఇష్టానుసారంగా ప్రవర్తిస్తూ విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నా విద్యాశాఖ చూసీచూడనట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సెలవు దినాల్లో పాఠశాలలు నిర్వహించరాదన్న నిబంధనకు కరస్పాండెంట్లు ఏనాడో తిలోదకాలు ఇచ్చారు. తాజాగా ఈ విద్యా సంవత్సరం పూర్తి కాకమునుపే పెద్ద క్లాసులకు విద్యాబోధన ప్రారంభం అయ్యింది. 5వ తరగతి నుంచి 10వ తరగతికి వచ్చే ఏడాది ప్రమోట్ అయ్యే విద్యార్థులకు క్లాసులు ప్రారంభించేశారు. అంతే కాకుండా యూనిట్ టెస్టులు, స్లిప్ టెస్టులు పెట్టేస్తున్నారు. అలాగే ఒంటి పూట బడులను నిర్వహించాలన్న నిబంధన వున్నప్పటికీ అదెక్కడా అమలు కావడం లేదు. దీంతో పిల్లలపై తీవ్ర ఒత్తిడి వుంటున్నా విద్యాశాఖ అధికారులు వీటి గురించి పట్టించుకోకపోవడం, కన్నెత్తి పాఠశాలలను తనిఖీ చేయకపోవడంతో ప్రైవేట్ పాఠశాలలది ఇష్టారాజ్యం అయ్యింది. దీంతో తమ పిల్లలపై అధిక ఒత్తిడి, భారం పడుతోందని తల్లితండ్రులు వాపోతున్నారు. ఇప్పటికే గుర్తింపులేని పాఠశాలలపై చర్యలు చేపట్టడంలో మీనమేషాలు లెక్కిస్తూ విమర్శలపాలైంది. ఈ పరిస్థితుల్లో సెలవు దినాల్లో పాఠశాలలు నిర్వహిస్తున్నా, వార్షికోత్సవాల పేరిట విద్యార్థుల ముక్కుపిండి వసూలు చేస్తున్నా, విద్యా సంవత్సరం గడవకముందే కొత్త తరగతులు నిర్వహిస్తున్నా ఆ సంగతులేవీ తమ పరిధిలో కాదన్నట్లు వ్యవహరిస్తున్న విద్యాశాఖాధికారులపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

అమ్మ హస్తం సరుకులెక్కడ?

నామ్‌కేవాస్తేగా పంపిణీ

అమ్మహస్తం పథకం ద్వారా తెల్ల రేషన్ కార్డు లబ్దిదారులకు అందిస్తామన్న తొమ్మిది రకాల సరుకులు రేషన్ షాపులకు అందలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పథకం ఉగాది నుంచి అమలు చేస్తామని సిఎం ప్రకటించిన సంగతి తెలిసిందే. పథకం ఉద్దేశం లబ్ది దారులకు కొంత మేలు చేకూర్చే విధంగా వున్నప్పటికీ అమలు చేసే దగ్గర కొచ్చేలోగా అనేక లోటు పాట్లు చోటు చేసుకొంటున్నాయి. ఈ నెలలో రెండు దఫాలు జిల్లా పర్యటనకు విచ్చేసిన సిఎం అమ్మహస్తం పథకాన్ని ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి 16న ప్రారంభింపజేసి ఒకరిద్దరికి మాత్రం తొమ్మిది రకాల సరుకులు వుండే బ్యాగ్‌ను 185 రూపాయలకే అందించారు. జిల్లావ్యాప్తంగా వున్న అన్ని రేషన్ షాపులకు ఈ నెలలో బియ్యం తప్ప ఇతర సరుకులు సరఫరా కాలేదు. సరుకులు ఏ కారణం చేత సరఫరా కాలేదన్న దానిపై సరైన సమాధానం చెప్పే అధికారి లేకుండా పోయారు. తొమ్మిది రకాల సరుకులు ఎలా వుంటాయన్న దానిపై గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు చర్చించుకుంటూ ఎదురుచూస్తున్నారు. రేషన్ షాపు డీలర్లను ప్రశ్నిస్తే పౌరసరఫరాల శాఖ గోడౌన్లకే సరకులు ఇంకా చేరలేదని షాపులకు ఎప్పటికి వస్తాయో తెలియడం లేదని చెబుతున్నారు. అధికారులు స్పందించి అమ్మ హస్తం పథకం సరుకులను త్వరితగతిన సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటే ప్రజలు హర్షిస్తారు.



అమ్మ హస్తం సరుకుల సంచిని అందిస్తున్న మంత్రి.



తగ్గిన బంగారం ధరలు!

ఎన్నాళ్లకెన్నాళ్లకన్నట్లు బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. నిన్నమొన్నటి వరకు ఆకాశాన్నంటిన పసిడి ధరలు తిరిగి నేలకు జారుతుండడంతో వినియోగదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు కొన్నేళ్లుగా బంగారం ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. సామాన్య, మధ్యతరగతి వర్గాల వారికి ఇవి పూర్తిగా దూరం అయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరూ వూహించని విధంగా పతనం అవుతుండడంతో తిరిగి బంగారు ఆభరణాలు కొనేందుకు కొనుగోలు దారులు సిద్ధమౌతున్నారు. పది గ్రాముల బంగారంపై 2500 రూపాయల నుంచి 3000 రూపాయలు తగ్గడంతో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన వారు బంగారంగళ్ల బాట పట్టారు. బంగారు ఆభరణాలపై ఎంతో మక్కువ వున్నప్పటికీ చుక్కలనంటిన ధరల కారణంగా వెనక్కు తగ్గి వున్నవారు ఇప్పుడు తమ ముచ్చట తీర్చుకొనేందుకు వడివడిగా అడుగులు వేస్తున్నారు. దీంతో గత రెండు మూడు రోజులుగా నగరంలోని పలు బంగారు అంగళ్లు కొనుగోలు దారులతో నిండి వుంటున్నాయి. మొన్నటి వరకు వెలవెలపోయిన బంగారు షాపులకు ధరలు తగ్గడం, వినియోగదారుల రాకతో కొత్త కళ వచ్చినట్లయ్యింది. ముందు ముందు ఈ పసిడి ధరలు మరింతగా తగ్గుముఖం పడుతాయని నిపుణులు విశ్లేషిస్తుండడంతో వేచి చూసే ధోరణిలో మరికొందరున్నారు. మరోవైపు అధికంగా బంగారం కొన్న వ్యాపారులు, పెట్టుబడులు పెట్టిన మదుపరుల్లో మాత్రం ఈ ధరలు తగ్గడంపై ఆందోళన వ్యక్తమౌతోంది.

● చెత్త తోపుడు బండ్ల

కొనుగోలులో గోల్‌మాల్!

మునిసిపాలిటీలో జరిగే అక్రమాలు, అవకతవకలు అన్నీ ఇన్నీ కావు. వడ్డించే వాడు మనవాడైతే బంతిలో చివరన కూర్చున్నా మేలేనన్నట్లు ప్రజాప్రతినిధులు అండదండలు, అధికారుల సహకారంతో అవకాశం వున్న చోటల్లా దోపిడీకి పాల్పడుతూ ప్రజాధనాన్ని దోచుక తింటున్నారు. ఇందుకు తాజా ఉదాహరణ చెత్త ఎత్తే తోపుడు బండ్ల కొనుగోలు. టెండర్లు గిండర్లు లేకుండానే వీటిని కొనుగోలు చేసే కాంట్రాక్టు ఒక వ్యక్తికి అప్పగించడంతో లక్షలాది రూపాయలు దుర్వినియోగం జరిగింది. దీనిని పరిశీలిస్తే పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో రోడ్లపై చెత్త ఎత్తేందుకు తోపుడు బండ్లు వినియోగించేవారు. ఇప్పుడు వీటి స్థానంలో ఆటోలు వచ్చేశాయ్. ఆటోల ద్వారా చెత్తను సేకరించి డంపర్ బిన్‌లలో నింపి, లారీలలో తరలిస్తుంటారు. వున్న తోపుడు బండ్లు ఏనాడో మూలన పడ్డాయి. అలాంటిది తాజాగా కార్పొ

కార్పొరేషన్‌లో కుంభకోణం

రేషన్ పరిధిలో చెత్త ఎత్తేందుకు తోపుడు బండ్లను పెద్ద ఎత్తున కొనుగోలు చేయడం, వాటిని నిబంధనలకు విరుద్ధంగా ఒక వ్యక్తికి అప్పగించడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒకసారి 200 తోపుడు బండ్లను కొనుగోలు చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధికి రాత్రికి రాత్రి ఆలోచన వచ్చినట్లుంది. దీని ద్వారా తమ అనుచరులు, బినామీలకు లబ్ది చేకూర్చాలన్నది ఆయన వ్యూహం. అంతే టెండర్ల ప్రక్రియకు మంగళం పలికి ఈ కొనుగోలు జరిపారు. ఇందులోనూ కొందరు అధికారులు అంతా సక్రమమే అనిపించేందుకు కాంట్రాక్టర్ 13,500 రూపాయలు కోడ్ చేస్తే బేరమాడి 8,500 రూపాయలకు ఒక్కో తోపుడు బండిని కొనుగోలు చేసేలా చేసి ఖజానాకు లబ్ది చేకూర్చామని మసుపూసి మారేడు కాయ చేశారు. అసలు సంగతి గమనిస్తే ఈ తోపుడు బండి బయట ఐదువేల రూపాయలకంటే ఇంకా తక్కువ ధరకే వస్తాయి. దాదాపు 200 తోపుడు బండ్లు కాంట్రాక్టర్ నిర్ణయించిన ధరకే కొనుగోలు చేశారు. కానీ ఇందులోనూ అవకతవకలు చోటుచేసుకొన్నాయట. మొత్తం 20 శానిటరీ డివిజన్లలో ఒక్కో డివిజన్‌కు పది బండ్లను ఇస్తామన్న అధికారులు అరకొరగా ఇవ్వడం విమర్శలకు దారి తీసింది.

వివేకానందుని జయంత్యుత్సవాలు!

స్వామి వివేకానంద 150వ జయంతి ఉత్సవంలో భాగంగా జిల్లా సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో నగరంలో ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వివేకానందుడు చూపిన మార్గం అందరికీ ఆదర్శనీయం అన్నారు. యువతలో జాతీయ భావాలు, దేశభక్తి రగిలించిన మహనీయుడని, శక్తి సంపన్నుడని కొనియాడారు. చికాగోలో వివేకానందుడు చేసిన ప్రసంగం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ప్రతిఒక్కరూ ఆయన ఆశయాలకు అనుగుణంగా, ఆయన చూపిన తోవలో నడిచి దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. వేదాయపాళెంలో గల ఎంవిఎస్ కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో వేదిక ప్రధాన కార్యదర్శి కోడూరు సత్యం, జిల్లా అధ్యక్షుడు ఎం.వి.కృష్ణయ్య, బాలసుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



జగన్‌లో మధనం

మొదటి పేజీ కొరవ

టున్నారు. జగన్ జనాదరణ ఏ మాత్రం తగ్గలేదు కాబట్టి, ఈ కలతల ప్రభావం పెద్దగా ఎన్నికల ఫలితాల మీద పడక పోవచ్చు. కానీ ప్రత్యర్థి బలంగా వున్న చోట అంతఃకలహాలు పార్టీ అవకాశాలను దెబ్బ తీస్తాయని భయపడుతున్నాడు జగన్.

సంతనూతనపాడులో దారా సాంబయ్య అనే అభ్యర్థిని ప్రతిపాదించారు. గతంలో ఆయన వైఎస్ అనుచరుడు. గుంటూరు జిల్లాలో ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా పని చేశాడు. తెనాలిలో జరిగిన కల్తీ కల్లు ఘోరం ఆయన అక్కడ వున్నప్పుడే జరిగింది. అందులో దాదాపు పాతిక మంది చనిపోయారు. కానీ తన మనిషి కాబట్టి దారా సాంబయ్యను వైఎస్ కాపాడాడు. అయితే ఆ తర్వాత రాజకీయాలలో చేరి, అదే వైఎస్‌ను బండ బూతులు తిట్టాడు. ఇప్పుడు అదే దారా సాంబయ్య వైవి సుబ్బారెడ్డి శరణు చొచ్చాడు. గతం పట్టించుకోకుండా ఆయన్ను పార్టీ కో ఆర్డినేటర్‌గా నియమించాడు వైవి సుబ్బారెడ్డి. అయితే ఏమి జరిగిందో ఏమో దారా సాంబయ్య తన పాత పద్ధతినే పాటించాడు. లోటస్ పాండ్ పార్టీ ఆఫీస్‌లో అందరినీ తిట్టి పోశాడు. ఇటువంటి వాడికి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పదవి ఎట్లా ఇస్తావని అందరూ కలిసి వైవి సుబ్బారెడ్డిని నిలదీస్తున్నారు.

కందుకూరు నియోజకవర్గంలో మాధవరావు అనే అభ్యర్థి విషయంలో కూడా ఇటువంటి ఇబ్బందే ఎదురైంది. మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఈ ఎంపిక పట్ల తీవ్ర అభ్యంతరం చెప్తున్నాడు.

వైవి బలహీనత గమనించిన పార్టీ సీనియర్లు ఆయన్ను తేలికగా తీసుకొంటున్నారిప్పుడు. ఏమి మాట్లాడినా నీకేమి తెలుసు రాజకీయం అని నవ్వుతున్నారు. కొణతాల రామకృష్ణ, జలగం వెంకట రావు, కొండా సురేఖ, కొండా మురళి వంటి వారి నుంచి సుబ్బారెడ్డికి ఇటువంటి చేదు అనుభవాలు ఎదురౌతున్నాయి. జగన్ పరోక్షంలో పార్టీ కీలక నిర్ణయాలన్నీ వైవి ద్వారానే జరగాలన్నది నియమం అయినప్పటికీ ఈ సీనియర్లు ఆయనతో మాట మాత్రం చెప్పకుండా నిర్ణయాలు తీసుకొంటున్నారు.

మొత్తంమీద తాను లేనప్పుడు పార్టీ నడపడానికి తగిన వ్యక్తులు లేరన్న ఆందోళన జగన్‌ను కలవర పరుస్తున్నది. సుప్రీంకోర్టులో ఇప్పుడు దాఖలు చేసిన బెయిల్ దరఖాస్తు ఫలిస్తే పర్వాలేదు. కానీ ఏ కారణం వల్లనైనా మరికొంత కాలం జైలులో వుండక తప్పని పరిస్థితి వస్తే ఎన్నికలకు పార్టీని సిద్ధం చేసేది ఎట్లా అన్న భయం జగన్‌ను పీడిస్తున్నది. కాంగ్రెస్‌ను చూసి జగన్ భయపడడం లేదు. అది మృత పార్టీ అన్న ధీమా వుంది. అయితే చంద్ర బాబును తేలికగా తీసుకోవడం కుదరని పని. చంద్ర బాబుకు జనాదరణ వున్నా లేకపోయినా రాజకీయ చాతుర్యం మాత్రం పుష్కలంగా వుంది. వ్యూహాలు రచించడంలో దిట్ట. మరొక ప్రక్క కెసిఆర్ కూడా అంతే రాజకీయ మేధావి. వీరిద్దరినీ నిలువరించ కుంటే ఎంత జనం తన వైపు వున్నా ఫలితం తాను ఆశించినట్లు వచ్చే అవకాశం లేదు. జగన్‌కు కావల సింది పెద్ద పార్టీగా గెలవడం కాదు ముఖ్యమంత్రిగా కుర్చీలో కూర్చోవడం. అది జరగాలంటే ఈ ఎన్నికల సంవత్సరంలో పార్టీ అడుగు ఆచితూచి వేయాలి. అందుకు తగిన వ్యూహ రచనా పాఠవం తన పార్టీలో లోపించడం జగన్‌కు ఆందోళన కల్గించే విషయం. దాన్ని ఎట్లా పూరించాలా అని మధన పడుతున్నాడు జగన్.

మేకపాటి సోదరులు

మొదటి పేజీ కొరవ

నార్వం. జిల్లాకే చెందిన ఒక శాసనసభ్యుడు బహిష్కరణ పిలుపు ఇచ్చిన తర్వాత మరొక శాసనసభ్యుడు హాజరు కావడం రాజకీయ విశేషమే కదా?

కేవలం సభకు వెళ్లడమే కాదు. ఆ సభలో రామనారాయణరెడ్డికి అనుకూలంగా మాట్లాడాడు మేకపాటి శేఖర్‌రెడ్డి. ఆనం వారికి తమకూ విభేదాలు లేవని, మధ్యలోనివారు లేనిపోని కలతలు సృష్టించారని, మంత్రి తమకు అభిమానపాత్రుడని మాట్లాడాడు శేఖర్‌రెడ్డి. తమ పార్టీ నేతను ఉరితీయాలన్న ప్రత్యర్థి, తమకు అభిమాన పాత్రుడని చెప్పడంలో మేకపాటి కుటుంబీకుల ఉద్దేశ్యం ఏమిటి అన్నది లోటస్ పాండ్‌లో పెద్ద చర్చగా వుంది. అన్నమాట, అనుమతి తీసుకోకుండా స్వతంత్రించి రాజకీయం చేసే అలవాటు శేఖర్‌రెడ్డికి లేదు. ఆ దృష్టితో చూసినప్పుడు ఈ ఉదంతం వెనుక కీలక రాజకీయ ఆలోచనలేవో వున్నాయని సందేహిస్తున్నారు జగన్ పార్టీ నేతలు.

నాగార్జున

9వ పేజీ కొరవ

ఇవన్నీ నాగార్జునను కలత పెట్టాయి. రేవంత్‌రెడ్డి జూనియర్ ఎన్టీఆర్‌కు ప్రియ స్నేహితుడు. జూనియర్ ఎన్టీఆర్ రాజకీయ ప్రసంగాలు వ్రాసి పెట్టింది రేవంత్‌రెడ్డి అన్న సంగతి అందరికీ తెలుసు.

తెలుగుదేశం పార్టీ మొత్తంగా తన మీద దాడికి దిగడం నాగార్జునను కలత పెట్టింది. ఈ సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి నందమూరి బాలకృష్ణ సహాయం కోరాడు నాగార్జున. అయితే బాలకృష్ణ చాలా ఖండితంగా మాట్లాడాడట. నువ్వు జగన్‌తో స్నేహం చేస్తూ, వారి పార్టీకి ప్రచార కర్తగా వ్యవహరిస్తూ, నా సహాయం ఎట్లా అడుగుతావని నిర్మొగమాటంగా ఎదురు ప్రశ్నించాడట. దానితో మరింత భయపడిన నాగార్జున నేరుగా బాలకృష్ణ ఇంటికి వెళ్లి సర్దుబాటుకోసం ప్రయత్నం చేశాడు. అయితే ఆయన్ను కలవడానికి బాలకృష్ణ ఇష్టపడలేదు. ఇంట్లో లేడని చెప్పి వెనక్కు పంపేశాడట. శిల్ప కళా వేదికలో జరిగిన టి.సుబ్బరామ రెడ్డి టీవీ9 అవార్డుల సభలో ఈ తేడాలు స్పష్టంగా బయటపడ్డాయి. నాగార్జున, బాలకృష్ణలు ఇద్దరూ ఆ సభకు వచ్చినప్పటికీ, ఒకరితో ఒకరు మర్యాదకు కూడా మాట్లాడుకోలేదు. కనీసం నమస్కారం కూడా చేసుకోలేదు. ఎడ ముఖం పెడ ముఖంగా వుండిపోయారు.

మొత్తం మీద నాగార్జున భూముల వివాదం సినీ పరిశ్రమలో కలకలం సృష్టిస్తున్నది. ఒకప్పుడు ఎన్టీఆర్, ఏఎన్నార్‌ల మధ్య తీవ్ర బేధాభిప్రాయాలు వుండేవి. ఇద్దరి అభిమానులు శత్రువుల వలె వ్యవహరించేవారు. ఇప్పుడు మరొకసారి ఆ రెండు కుటుంబాల మధ్య విభేదాలు మొదలైనాయి. అయితే ఎన్టీఆర్ రోజులలో నాటి పరిస్థితులు ఇప్పుడు లేవు. అప్పటి వలె అభిమానుల వీరంగాలూ లేవు. పైగా నాగార్జున, బాలకృష్ణలిద్దరూ రిటైర్‌మెంట్ దశలో వున్నారు. అందువల్ల వీరి పేచీలు సినీ పరిశ్రమ మీద పెద్దగా ప్రభావం చూపకపోవచ్చు. కానీ రాజకీయంగా మాత్రం రేపటి ఎన్నికలలో చెరొక పక్షం చేరి ప్రజలకు మంచి వినోదం కల్గించే అవకాశం వుంది. సినీనటులు ఏ కారణంతో వీధులలోకి వచ్చినా జనానికి పండగే కదా?



కావలి మునిసిపల్ మాజీ కౌన్సిలర్ ఆత్మకూరు బ్రహ్మయ్య కుమార్తె నాగశశి ప్రియతమ్ ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో విజయవాడలోని శ్రీ చైతన్య కాలేజీలో ప్రథమురాలిగా నిలచిన సందర్భంగా ఆమె నోరు తీపి చేస్తున్న కావలి ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు.

నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

ఉన్న విశ్వసాయి జూనియర్ కాలేజి విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో తమ తడాఖా చూపించారు. ఎంపిసిలో 470 మార్కులకు గాను 462 మార్కులను పి.రిషితారెడ్డి, కె.సాయిహేమంత్, డి.త్రినేష్ సాధించారు. బైపిసిలో 470 మార్కులకు గాను ఎం.రిషిత, లాస్య, అనూషారెడ్డి 433 మార్కులు సాధించారు. బైపిసి విభాగంలో 99 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. 123 మంది విద్యార్థులు 400లకు పైగా మార్కులు సాధించడానికి టెస్ట్ బుక్స్‌లోని బోధనాంశాలు బోధించడమే కారణమని విశ్వసాయి సంస్థల ఛైర్మన్ డాక్టర్ సత్యనారాయణ, వైస్ ఛైర్మన్ కృష్ణమోహన్ తెలిపారు.

రాజవోలులో శ్రీరామనవమి

అనుమసముద్రంపేట మండలం రాజవోలు గ్రామంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ ధర్మకర్తలు చిట్టమూరు గోపాల్‌రెడ్డి, చిట్టమూరు వాసుదేవరెడ్డి, మహతి, మహర్షిరెడ్డిల ఆధ్వర్యంలో కళ్యాణోత్సవం అత్యంత శోభాయమానంగా నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కృష్ణ చైతన్య ప్రభంజనం!

జూనియర్ ఇంటర్ ఫలితాల్లో నెల్లూరు వహాబ్‌పేటలోని కృష్ణచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి మార్కులు సాధించారు. ఎంఇసి గ్రూప్‌లో చదివిన యుగేష్ అనే విద్యార్థి 500 మార్కులకుగాను 482 మార్కులు సాధించాడు. ఎంపిసిలో సుమలత అనే విద్యార్థిని 470 మార్కులుగాను 460 మార్కులు సాధించింది. సిఇసి విభాగంలో శిరీష అనే విద్యార్థిని 467 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా కృష్ణచైతన్య విద్యాసంస్థల డైరక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సాధారణ స్థాయిలో చదివే విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించడం గర్వంగా వుందన్నారు.

శ్రీ గాయత్రి హవా!

జిల్లాలో గాయత్రి విద్యాసంస్థల బ్రాంచి స్థాపించిన మొదటి సంవత్సరంలోనే అటు ఎంపిసితో పాటు ఇటు బైపిసి విభాగాల్లో ఇక్కడ చదివిన విద్యార్థులు తమ సత్తా చూపించారు. ఎంపిసిలో షేక్ అలీష్ 470 మార్కులకుగాను 465 మార్కులు సాధించి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచాడు. గౌతమి 461, సి.హెచ్.రాజేష్ ఈ విభాగంలోనే 460 మార్కులు సాధించాడు. బైపిసిలో ఎ.సునయన 440 మార్కులకు 432, జి.రాజేష్ 431, కె.యశ్వంత్ శ్రీనివాస్ 430 మార్కులు సాధించారు. అధ్యాపకుల కృషి, ప్రణాళికాబద్ధమైన శిక్షణలతో జిల్లాలో మొదటి స్థానాలు గాయత్రిలో చదివిన విద్యార్థుల వశమయ్యాయని విద్యాసంస్థల ఎజిఎం నరసయ్య నాయుడు చెప్పారు.

మరణం



పెనుబర్తి గ్రామంలో పెద్ద రైతుగా పేరు ప్రఖ్యాతులు గాంచిన దివంగత సోమవరపు శంకరరెడ్డి సతీమణి కాంతమ్మ(83) 16వ తేది నెల్లూరు రామ్మూర్తి నగర్‌లోని ఆమె కుమారుని ఇంట ప్రాణాలొదిలారు. ఈమెకు ఇద్దరు కుమారులు. ఒక కుమార్తె. పెద్ద కుమారుడు సోమవరపు రవీంద్రరెడ్డి ఇటీవలే మరణించారు. రెండవ కుమారుడు ప్రభాకర్‌రెడ్డి, కుమార్తె మంజులరెడ్డి మంచి స్థానాల్లో వున్నారు. తల్లిని కోల్పోయిన వీరి కుటుంబానికి మా సానుభూతి.

జనవాణి


2వ పేజీ కొరవ

గతుల వారికి ప్రాముఖ్యత కల్పించడం ముఖ్యం. గతంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏర్పాటు చేసిన సక్సెస్ స్కూళ్ల పథకానికి ఏ గతి పట్టిందో అందరికీ తెల్సిందే. ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ముందు చూపుతో వ్యవహరించాలి. ఈ మోడల్ స్కూళ్లు కాలగమనంలో కేంద్రీయ పాఠశాలల స్థాయికి తీసుక రావాలన్న కేంద్రప్రభుత్వం బృహత్తర సంకల్పం కార్యరూపం దాల్చేలా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది.

కె.సువర్చల నెల్లూరు

పదరంగం -64

నిర్వహణ : బాబాజీ



అడ్డం

1. సంతోషించదగిన విషయం (4)
5. ఆ అరణ్యం కారడవి (5)
8. తడబడిన సరసితం (4)
9. దట్టమైన దుప్పటి (3)
11. అబద్ధం కాదు (2)
13. హల్లులలో మొదటి అక్షరం నిలువు 28కి చేరిస్తే కంటివ్యాధి (1)
14. అటునుంచి పాదాల రంగు (3)
16. కోరిక, దేవుడికి విన్నవించేది (2)
19. పాటలు పాడే స్త్రీ (3)
20. ఇంద్రుని నగరం (5)
22. సరసం కాదు, సంక్షిప్తంగా విప్లవ రచయితల సంఘం (3)
23. నిద్రలో చేసే శబ్దం (3)
24. కాకినాడ స్వీటు (2)
25. రాకపోతే ఆ మాటే చెప్పండి (2)
26. డూప్లికేటు (3)
27. టేకు కొయ్య (3)
29. క్షేమం, జాగ్రత్త (3)
31. రోకలి (5)
32. చెడ్డ పేరు (4)

నిలువు

1. పిల్లన గ్రోవి (3)
2. పని మనిషి (2)
3. తడబడిన వసంతం (3)
4. దేవ బాతు (2)
5. ముఖ్యమైనది 'కీ'తో ప్రారంభం (3)
6. శబ్దం, అందెలదా? (3)
7. ఇరువైపులా సంతోషం (3)
10. జైలు (5)
12. జత, ఇద్దరు (2)
15. క్షీరాన్నం (3)
16. అంకురాలు (4)
17. రకాలులో 'లు' లోపించింది (2)
18. .... వైవాహికములందు బొంక వచ్చు (6)
20. పొలం (3)
21. క్రింద నుంచి రైతు (2)
22. విశ్రాంతి (4)
23. గడ్డపార (4)
27. స్వప్నము (2)
29. రెండు 'ప'లు (2)
30. క్రింద నుంచి వారించే వాడు (2)

సమాధానాలు

పదరంగం -63

1మ	ధు	2ప	3ము		4త		5స	6ఫ	7లం
జ		8గ	ది		9రు	10ణం		11ల	గో
12లి	13పి		14మి	ణు	గు	రు		15సా	టి
	16లు	17వే				త		యం	
18దా	పు	న		19శం	20పా		21న		22బు
గు		23వే	ట		24ట	25మా		26పూ	రి
27డు	28ఖ	లు		29ఆ	వ	కా	య	జా	డి
30మూ	ర		31పా	శ	ము			బే	
32త	ము	33క	పా			34లు	35వే	డి	36వ
లు		37పి	పా	సి		38కా	డి		ల

గత 'స్మృతుల' తీపి గుర్తులను పాఠకులకు అందజేసిన

'రసిక్' హృదయాంతరంగాలు!

డాక్టర్ గుర్రం భానుమూర్తి కలం పేరు 'రసిక్'. రసికత్వం సాహిత్య రచనల్లోనూ, సినీ విశ్లేషణల్లోనూ బాగా ప్రస్ఫుట మవుతుంది. 1960-82 మధ్య 'జమీన్‌రైతు' వార పత్రికలో శరపరంపరగా రాసిన వ్యాసాల్ని ఏర్చి కూర్చి ఈ మధ్య 'సినీ వ్యాస మంజరి' పేర ఓ చిన్న పుస్తకాన్ని పాఠకుల ముందుంచారు 'రసిక్'.

ఈ సంపుటిలో పదమూడు సినిమాలకు సంబంధించిన వ్యాసాలు, 'జమీన్‌రైతు'లో వచ్చిన తేదీలు వున్నాయి. ఇవి భావి సినీ వ్యాస సమీక్షకులకు బాగా ఉపయోగపడుతుంది. పాఠకులకు విషయ పరిజ్ఞానానికి కొంతకు కొంత ఉపకరిస్తుంది.

భక్త జయదేవ, మొగలు-ఏ-అజామ్ వంటి వ్యాసాలు మిగతా వ్యాసాలకంటే వస్తు, శిల్పరీత్యా విశ్లేషణలు బాగున్నాయి. అయితే జయదేవుడు ఒరిస్సా రాష్ట్రం కటకం(కటక్) ప్రాంతానికి చెందిన సంస్కృతి కవి పద్మావతి. ఆలయ నర్తకి దేవదాసి కుమార్తె, గీతాగోవిందం వంటి అద్భుత కావ్యానికి లయబద్ధంగా, నిబద్ధంగా నృత్యం చేసింది పద్మావతి. తావిరోహే తవదీనా రాధా? అన్నవి జయదేవుని శ్లోకాలు. ఈక్రమంలో ఇద్దరి పరిచయమూ ప్రేమగా మారి భార్యాభర్తలవుతారు. ఆ దేశపు రాణికి పద్మావతి అభిమాన పాత్రురాలు. జయదేవుడు రాజు ఆస్థాన కవి. పద్మావతి, జయదేవుల అన్యోన్య దాంపత్యానికి అసూయ చెందిన రాణి రాజుతో వేటకు వెళ్లిన జయదేవుడు మరణించినట్లు చెబుతుంది. పద్మావతి మరణిస్తుంది. సినిమా కథలు చరిత్రను కలగాపులగం చేస్తాయి. అందువల్ల సినిమా సుఖాంతమవుతుంది. ఈ అంశం అన్ని తెలుగు చారిత్రక సినిమాలకు వర్తిస్తుంది. మొగల్-ఏ-అజామ్ పరిస్థితీ అంతే. అయితే రచయిత సినిమా కథనం వరకే పరిమితమై మంచి పని చేశారు.

పుస్తకసమీక్ష

సినీ వ్యాస మంజరి

(వ్యాస సంకలనం)

రచయిత

'రసిక్'

సమీక్షకుడు

పాయసం సుబ్రహ్మణ్య మహర్షి

వెల : **రూ.60/-** పుటలు : **68**

ప్రతులకు : **శ్రీమతి జి.అరుంధతి**

10-71/8, లావణ్య అపార్టుమెంటు

రాయల్‌నగర్, ఆర్.సి.రోడ్డు


తిరుపతి - 517 501

ఒక్కో సినిమా కథనాన్ని చెప్పిన పద్ధతి, అక్కడక్కడా తన అభిప్రాయాలను జొప్పించిన తీరు బాగుంది. వ్యాసాలలో ఎక్కడా అస్పష్టత కనిపించదు. అయితే వ్యాసాలలో క్లుప్తతను పాటించడం వల్ల చెప్పవలసిన విషయాలను రచయిత చెప్పలేదేమో అనిపిస్తుంది.

శాంతి నివాసం, సుజాత, దేవాంతకుడు, కల్పన, పధేర్ పాంచాలి, కులగోత్రాలు, పున ర్జన్మ, అనుపమ, ఆనంద్, శంకరాభరణం, శుభ లేఖ వంటి సినిమాల వ్యాసాలు ఇందులో పొందు పరచబడ్డాయి. అనుబంధంలో శారద, రమణారెడ్డి జీవితాల్ని స్పృశించారు. వారి సినిమాల్ని, నటన వరకు వ్యాసాల్ని పరిమితం చేశారు. వ్యక్తిగత జీవితాల జోలికి పోలేదు. అయితే నటుల్ని గురించి రాసేటప్పుడు కొన్ని జీవింతాశాలకు, ఘటనలకు ప్రాధాన్యత ఇవ్వాలి. అలాంటప్పుడే భావి నటులు వారి జీవితాల్లోని అనుభవాల్ని తీసుకొని తమ భావి జీవితాల్ని మలచుకో గలుగుతారు. వ్యాస రచనలో జీవిత ఘటనలు పాఠకులపై చాలా ప్రభావాల్ని చూపిస్తుంది. వారిని వ్యాసాల్ని మొదటి నుంచి చివరి వరకూ చదివించాలంటే ఇందుకు మించి కిటుకు మరొకటి లేదు.

చివరలో రాజ్‌కపూర్‌పై రచయిత వ్రాసిన కవిత, నటుడి పట్ల రచయితకున్న అభిమానాన్ని వ్యక్తం చేస్తుంది. పుస్తకం మొత్తానికి చివరి వరకూ చదివిస్తుంది. ఈ విషయంలో రచయిత సిద్ధహస్తులు.

సినీ పరిశ్రమలో అంకితభావంతో పని చేసి అద్భుత కళాఖండాలను సృష్టించి అగ్ర దర్శకుల కోవకు చెందిన 'సత్యజిత్ రే'కు పుస్తకాన్ని అంకితమిచ్చి రచయిత మంచి పని చేశాడు.



రైతు లోకం

ఆరోగ్యవంతమైన వరి నారు పెంచటానికి సూచనలు!

నారు మళ్ళను 4-5సార్లు బాగా దున్ని కలుపు లేకుండా బురద దుక్కి చేయాలి. నీరు పెట్టటానికి, తీయటానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేయాలి.

స్వచ్ఛమైన నాణ్యత కల్గిన విత్తనాన్ని రైతులే వారి పొలాల నుండి తయారు చేసుకోవచ్చు లేదా గుర్తింపు పొందిన సంస్థల నుండి పొందవచ్చు.

ప్రతి 5 సెంట్లు (200 చదరపు మీటర్లు) నారు మడికి 1 టన్ను పశువుల ఎరువుతో పాటు 2 కిలోల నత్రజని (4.4 కిలోల యూరియా), 1 కిలో భాస్వరం (6.5 కిలోల సూపర్ ఫాస్ఫేట్) మరియు 1 కిలో పొటాష్ (1.7 కిలోల మ్యూరియేట్ ఆఫ్ పొటాష్)లనిచ్చే రసాయనిక ఎరువులను వాడాలి.

ఇందులో సగం నత్రజని, పూర్తి భాస్వరం మరియు పొటాష్‌లను దమ్ములో వేయాలి. మిగిలిన సగం నత్రజనిని విత్తనం చల్లిన 12 - 14 రోజులకు చల్లాలి.

ప్రతి సెంటు (40 చదరపు మీటర్లు) నారు మడికి 5 కిలోల మొలకెత్తిన విత్తనాన్ని వాడితే నారు ధృడంగా ఆరోగ్యవంతంగా పెరుగుతుంది. తక్కువ విత్తనం వాడితే నారు పల్చనై బాగా దుబ్బుకట్టి, తీసేటప్పుడు సులువుగా రాక వ్రేళ్ళు తెగిపోయి, నాటిన తర్వాత పైరు పచ్చబడటం ఆలస్యమౌతుంది.

తెగుళ్ళ బారి నుండి కాపాడుటకు కిలో విత్తనానికి 2.5 గ్రాముల కార్బండజిమ్‌ను కలిపి 24 గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. లేక ఒక లీటరు నీటికి 1 గ్రాము కార్బండ జిమ్‌ను కలిపి, ఆ ద్రావణంలో విత్తనమును 24 గంటలు నానబెట్టి, 24 గంటలు మండెకట్టి నారు మడిలో చల్లుకోవాలి.

డాక్టర్ కె.పుల్లంరాజు
కోఆర్డినేటర్,
ఏరువాక (డాట్ సెంటర్), నెల్లూరు.

విత్తనాన్ని 24 గంటలు నానబెట్టిన తర్వాత, 24 గంటలు మండెకట్టి మొలకెత్తిన విత్తనాన్ని 1 సెంటీమీటరు లోతు నీరుంచి చల్లాలి. చల్లిన తర్వాత నారుమడి నుండి నీరు తీసివేసి, నారు 2-3 ఆకులు తొడిగే వరకు ఆరుతడిగా పెట్టాలి. అటుతర్వాత నీటిని పల్చగా వుంచాలి.

నారు మొక్కలు తీసేటప్పుడు మొక్కలు లేతాకుపచ్చరంగులో ఉంటే త్వరగా మూస తిరుగుతుంది. 4-6 ఆకులు వుండే సమయంలో 25-30 రోజులకు నారును నాటాలి. ముదురు నారు నాటితే దిగుబడులు తగ్గుతాయి.

నారుమడిలో ఊద నిర్మూలనకు ఎకరం నీరు మడికి బెంథియోకార్బ్ 50శాతం 1.5 - 2 లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 2 లేక 3 రోజుల్లో లేదా 7 లేక 8వ రోజున గాని పిచికారి చేయాలి. లేదా బెంథియోకార్బ్ 50 శాతం 20 కిలోల ఇసుకతో పలచటి నీటిపొర ఉన్నప్పుడు సమానంగా వెదజల్లి నీరు ఇంకేటట్లు చూడాలి.

నారు మడిలో సస్యరక్షణ చాలా అవసరం. విత్తిన 10 రోజులకు లేదా నారు తీయటానికి 7 రోజుల ముందు కార్బోఫ్యూరాన్ 3 జి గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాములు చొప్పున పొడి ఇసుకతో కలిపి వేయాలి. గుళికలను యూరియాతో కలిపి వేయరాదు. గుళికలను వాడునప్పుడు 2 అంగుళాల నీటిని ఉంచి గుళికలను వాడిన తర్వాత 2 రోజుల వరకు నీటిని పెట్టడం, తీయటం చేయరాదు. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లేక క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి కలిపి విత్తిన 10 రోజులకు మరియు 17 రోజులకు పిచికారి చేయాలి.



ఉత్తరక్రియలు

ప్రేమానురాగాలతో మా అందరి మనసులలో చెరగని
ముద్ర వేసుకొన్న అమృతమూర్తి, మా ఇంటి దైవం
శ్రీమతి సోమవరపు కాంతమ్మ గారు
తేది 16-04-2013 మంగళవారం నాడు స్వర్గస్తులైనారు.
వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

భర్త : కీ॥శే॥ సోమవరపు శంకర్‌రెడ్డి

కుమార్తె - అల్లుడు
వై.సి. మంజులారెడ్డి - రామిరెడ్డి

కుమారులు - కోడళ్లు
కీ॥శే॥ సోమవరపు రవీంద్రరెడ్డి - ఝాన్సీ
సోమవరపు ప్రభాకర్‌రెడ్డి - పద్మ

మనుమలు - మనుమరాళ్లు
వై.సి. సందీప్‌రెడ్డి, ఎస్.బలరామిరెడ్డి
వై.ఎస్. మాలినిరెడ్డి - వై.ఎస్.అనిల్‌రెడ్డి
ఎస్. శ్రీధీప్‌రెడ్డి - ఎస్.పూజిత, పి. మిధున్‌రెడ్డి - పి.దివ్యారెడ్డి

మునిమనుమలు - ముని మనుమరాళ్లు
వై.ఎస్. శ్రేయరెడ్డి, వై.ఎస్. సజీవ్‌రెడ్డి, వై.సి. ఈశ్వర్‌రెడ్డి
వై.సి. త్రిషరెడ్డి, పి.జస్విన్‌రెడ్డి, ఎస్. సమైరరెడ్డి

శ్రీమతి సోమవరపు కాంతమ్మ

W/O కీ॥శే॥ సోమవరపు శంకర్‌రెడ్డి

: ఉత్తరక్రియలు :

తేది 01-05-2013 బుధవారం **"నిలుపు"**
తేది 02-05-2013 గురువారం **"ఎత్తురేవు"**
నెల్లూరు, రామమూర్తినగర్‌లోని మా స్వగృహము నందు జరుగును.
బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

ప్రకటన
Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore. E-mail : jaminryot@yahoo.com